విశాలాంధ్ర

ప్రకాశం బాపట్ల

బుధవారం 07 ఆగస్టు 2024 8 పేజీలు

నేతన్నలకు సీఎం వరాలు ఇచ్చేనా?

హామీ కోసం నేతన్నలు ఎదురుచూపులు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : ఎన్నికల ప్రచారంలో చీరాల వచ్చినప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేనేతలకు చీరాలలో టెక్స్ టైల్ పార్కు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి అయ్యి రెండు నెలలు కాకముందే చంద్రబాబు చీరాలలో జాతీయ చేనేత దినోత్సవాన్ని జరపడానికి వస్తున్నారని ప్రకటన రావడంతోనే చేనేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీలు గత ఎన్నికలలో బీసీ అభ్యర్థి అయితేనే నియోజకవర్గ సమస్యలు పరిష్కారం అవుతాయని మద్దులూరి మాలకొండయ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించారు. గెలిచినప్పటి నుంచి ప్రజా సమస్యలు ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని మాలకొండయ్య చిత్తశుద్ధితో పని చేస్తున్నారు. నేడు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు బీవీ అండ్ బీఎన్ హైస్కూల్ మైదానంలో నిర్వహించే చేనేత దినోత్సవ వేడుకలలో పాల్గొనడానికి వస్తుండగా నేతన్నల హృదయాల్లో ఆనందం పెల్లుబుకుతున్నది. వ్యాపారపరంగా చీరాలకు చిన బొంబాయి అని పేరు ఇప్పటికే వున్నప్పటికీ గత ప్రభుత్వ హయంలో చేనేత రంగం నిర్వీర్యం అయ్యి చేనేతలు ఉత్పత్తి చేసిన వస్త్రాలు నిల్వలు ఉన్నాయి.నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు రాకతో టెక్స్ టైల్ పార్కు,చేనేత ఉత్పత్తులపై రాయితీలు కల్పిస్తారని చేనేతలు ఆశిస్తున్నారు.చేనేతలు ఉత్పత్తి చేసే చిరలపై నే కాకుండా ముడి సరుకులపై కూడా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జీ ఎస్ టీ పడుతుండడంతో వస్త్ర ఉత్పత్తుల ధరలు పెరిగి చేనేత రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఇప్పటికే చేనేత వస్త్రాలకు బ్రాండ్ ఇమేజ్ కల్పిస్తానని హామీ ఇచ్చారని ప్రభుత్వమే చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి ఆప్కో ద్వారా విక్రయిస్తే కొంత వెసులుబాటు అవుతుందని నేతన్నలు కోరుతున్నారు.చేనేత సహకార సంఘంలకు ఎన్నికలు నిర్వహించి పాలక వర్గాలను నియమిస్తే చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వచ్చి వాటిని అధిగమించే వీలుంటుందని చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించేందుకు నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని చేనేతరంగం చేనేతలు కోరుతున్నారు.ఎన్నికలు పూర్తి అయ్యాక చీరాలకు చంద్రబాబు రావడం ఎమ్మెల్యే మాలకొండయ్య నాయకత్వ లక్షణాలు మరోసారి బయట పడ్డాయని నేడు జరిగే జాతీయ చేనేత దినోత్సవంలో చీరాల అభివృద్ధికి ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు అభివృద్ధికి వరాల జల్లులు కురిపిస్తారని చీరాల శాసన సభ్యులు మాలకొండయ్య నేతృత్వంలో చీరాలను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

నేడు చీరాలకు సీఎం చంద్రబాబు

- జాతీయ చేనేత దినోత్సవంలో పాల్గొననున్న సీఎం
- ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి ఎస్.సవిత

విశాలాంధ్ర - బాపట్ల : జాతీయ చేనేత దినోత్సవాన్ని చేనేతల మధ్య నిర్వహించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చీరాలకు రానున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఖరారు కావడంతో మంత్రి హుటాహుటినా మంగళవారం చీరాలకు చేరుకున్నారు. మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, ఎస్పీ తుషార్ డూడి, జిల్లా సంయుక్త కలెక్టర్ బి.సుబ్బారావు కలిసి చీరాలలోని జాండ్రపేట గ్రామం, వేటపాలెం మండలం చేనేత పురి ప్రాంతాలను పరిశీలించారు. సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో హెలిప్యాడ్ ఏర్పాటును పరిశీలించారు. చీరాల మండలం జాండ్రపేట గ్రామం బట్ట వీరన్న అండ్ బీరక నాగయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాటుకు వేదిక ఖరారు కావడంతో ఆ పాఠశాల ప్రాంతాలను పరిశీలించారు. తొలుత చేనేత పార్కు కొరకు కేటాయించిన 20 ఎకరాల స్థలం క్లస్టర్ ప్రాంతాలను పరిశీలించారు. జాతీయ చేనేత దినోత్సవం మిగతా 2 లో ...

దర్శి అభివృద్ధిపై దృష్టి పెట్టండి

గొట్టిపాటి లక్ష్మికి సీఎం చంద్రబాబు భరోసా

విశాలాంధ్ర-దర్శి : అమ్మా లక్ష్మీ మీ రాజకీయ భవిష్యత్ నాకు వదిలేయండి. మిమ్మల్ని రాజకీయంగా ఎలా పైకి తేవాల్నో నేను చూసుకుంటాను. ప్రజాసేవలో నిమగ్నమై పనిచేసిన ప్రతీ ఒక్కరికీ టీడీపీలో మంచి భవిష్యత్తు ఉంటుంది కనుక ముందు మీరు దర్శి నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టండి. ఏం కావాల్నో అడగండి. మీ నియోజకవర్గాన్ని మీరు అభివృద్ధి పథంలో నిలిపి ప్రజలకు చేరువ అవ్వండి అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దర్శి టీడీపీ ఇంఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి భరోసానిచ్చారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆమె ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి దర్శి అభివృద్ధి ప్రణాళికపై ఒక అంచనా నివేదిక అందించారు. ఆమెతో పాటు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావులు దర్శి నియోజకవర్గ రాజకీయ పరిస్థితులు, అభివృద్ధిపై చంద్రబాబునాయుడుతో దాదాపు 30 నిముషాలపాటు చర్చించారు. దర్శి ప్రాంతంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని..శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణ నిమిత్తం దొనకొండ ప్రాంతంలో పారిశ్రామిక కారిడార్ వంటి జోన్ ఏర్పాటు మంచిదని చంద్రబాబు దృష్టికి తెచ్చారు. దర్శి పట్టణంలో అభివృద్ధి మౌలిక సదుపాయాలు కల్పన, రోడ్లు, డ్రైనేజీ విస్తరణ, ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి, డిగ్రీ కాలేజీ శాశ్వత భవనాలు, సాగర్ కాలువల మరమ్మత్తులు, అమృత పథకం ద్వారా ప్రతీ ఇంటికీ స్వచ్ఛమైన నీటి పంపిణీ తదితర అంశాలపై సర్వే అంచనాలను గొట్టిపాటి సీఎం దృష్టికి తీసుకెళ్ళి చర్చించారు. చంద్రబాబునాయుడు మాట్లాడుతూ ఎన్నికల తర్వాత కూడా ఒక డాక్టర్ గా, మహిళా నాయకురాలిగా దర్శి నియోజకవర్గంలో చురుగ్గా పనిచేస్తున్నట్లు తనకు సమాచారం ఉందన్నారు. కూటమి పక్ష నేతగా ఇకనుంచి ప్రభుత్వ అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి దర్శి నియోజకవర్గ అభివృద్ధిని తీర్చి దిద్దాలన్నారు. చంద్రబాబుకు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కుటుంబం కృతజ్ఞతలు తెలిపి తమకిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామన్నారు.

హత్యా రాజకీయాలకు పేటెంట్ జగన్

- వైసీపీని జనమే అంతం చేశారు
- సెక్యూరిటీ పేరుతో జగన్ పిచ్చి చేష్టలు
- టీడీపీ జిల్లా అధ్యక్షులు నూకసాని బాలాజీ

విశాలాంధ్ర-ఒంగోలు : జగన్ రెడ్డిని జనమే అంతం చేశారని... మళ్లీ జగన్ రెడ్డిని అంతం చేయాల్సిన అవసరం ఎవరికీ లేదని... కావాలని తప్పుడు ప్రచారాలతో జనాలను మభ్యపెట్టి ప్రభుత్వంపై బురద చల్లడానికి జగన్ రెడ్డి యత్నిస్తున్నాడని.. టీడీపీ ఒంగోలు పార్లమెంటరీ అధ్యక్షులు నూకసాని బాలాజీ అన్నారు. అబద్ధపు ఆలోచనలతో రాష్ట్ర ప్రజలను మోసం చేయాలనుకుంటే ఇప్పుడు వచ్చిన 11 సీట్లు కూడా లేకుండా ప్రజలే తరిమికొడతారన్నారు. కూటమి ప్రభుత్వంపై జగన్ రెడ్డి ఆరోపణలు చేయడం ఆకాశంపై ఉమ్మివేయడమే అన్నారు. ఆయన మంగళగిరి టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా నూకసాని బాలాజీ మాట్లాడుతూ జగన్ అసత్యాలను నమ్మకోవడంతో కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా జనం తరిమి తరమికొట్టారు. వైనాట్ 175 అన్న జగన్ రెడ్డి ఆశలు అడియాశలు అయ్యి... పిచ్చెక్కింది. భద్రతపై పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతున్నాడు. మాజీ ముఖ్యమంత్రికి ఎంతమంది భద్రత ఇస్తారో ప్రభుత్వం అంత భద్రత కల్పిస్తోంది. నాడు ఉత్తర కొరియా అధ్యక్షుడిలా 986 మంది సెక్యూరిటీని ఏర్పాటు చేసుకుని అది మళ్లీ ఇప్పుడు కోరుతున్నాడు. రాష్ట్రంలో హత్యలు చేసింది వైసీపీ నేతలే. హత్యా రాజకీయాలను రాష్ట్రంలోకి తీసుకు వచ్చింది జగన్ రెడ్డి, ఆయన తండ్రే. టీడీపీ పార్టీకి ఆ సంస్కృతిలేదు. టీడీపీ నేత చంద్రబాబుకు అభివృద్ధి ప్రజా సంక్షేమమే ముఖ్యం. వైసీపీ పాలనలో 2000 మంది టీడీపీ కార్యకర్తలను పొట్టన పెట్టుకున్నారు. చివరకు వైసీపీ ఎంపీని కూడా కొట్టించారు.గతఐదు సంవత్సరాల్లో ధ్వంసమైన పాలనను రెండు నెలల్లో గాడిన పెట్టి ప్రజాపాలన సాగిస్తుంటే జగన్ నాటకాలు ఆడుతున్నాడు. జగన్ రెడ్డి నాటకాలు చూసి జనం నవ్వుకుంటున్నారు. జనం నమ్మకపోవడంతో కూటమిపై ఏదోరకంగా బురద చల్లేందుకు యత్నిస్తున్నాడు. వైసీపీదే అబద్ధపు ఆలోచనలతో రాష్ట్ర ప్రజలను మోసం చేయాలనుకుంటే ఈసారి 11 సీట్లు కూడా లేకుండా ప్రజలు తరిమి కొడతారు. ప్రభుత్వంపై అవాకులు చవాకులు పేలితే వైసీపీపైనే ప్రజలు ఉమ్మేస్తారని నూకసాని అన్నారు.

డీజీపీని కలిసిన ఎస్పీ ఏఆర్ దామోదర్

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రకాశం జిల్లాకు నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఏఆర్ దామోదర్ మంగళగిరి రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ద్వారకా తిరుమలరావుని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రలపై డిజిపికి వివరించారు.

ఆశ కార్యకర్తల సమావేశం

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : ఆశ కార్యకర్తల సమావేశం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో మద్దెల పద్మ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐటి నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య పాల్గొని మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, నెలకు 26000 వేతనము ఇవ్వాలని, ఏఎన్ఎంల దౌర్జన్యాలు తగ్గించాలని, జనాభా సర్వేలు ఆ కుటుంబంలో చదువుకున్న వారి సర్వేలు ఆ పనులు కూడా ఆశలతో చేయిస్తున్నారని, ఆశా కార్యకర్తలు పని విభజన చార్టును ప్రభుత్వం వారు తెలపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఐటియుసి కార్యదర్శి షేక్ ఖాసిం, ఆశ కార్యకర్తలు సునీత రోజ్లిన్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యవసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలులోని దత్తాత్రేయ కాలనీ నందు నివసిస్తున్న ఇద్దరు నిస్సహాయులకు మంగళవారం మేము సైతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్ ఎల్ జి గ్రూప్స్ అధినేత మల్లిడి వీర రాఘవరెడ్డి ఆర్థిక సహాయంతో నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది.

మేము సైతం ఫౌండేషన్ చైర్మన్ జనసేవ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ఇద్దరి అన్నదమ్ములు నిస్సహాయులుగా ఒక పూరి గుడిసెలో తలదాచుకుంటూ ఇరుగు పొరుగువారు పెట్టిన అన్నం తింటూ చాలా ఇబ్బంది పడుతున్నా రని, వీళ్ళకి గవర్నమెంట్ ద్వారా పెన్షన్ కూడా రావడం లేదని గతంలో కూడా మేము సైతం ఫౌండేషన్ ద్వారా సహాయం చేయడం జరిగింది. ఈ మధ్యకాలంలో మా ఫౌండేషన్‌కి కాల్ చేసి కొద్దిగా నిత్యవసర సరుకులు ఇవ్వమని అడగగా మాకు అత్యంత ఆప్తులు బందారు వెంకటరమణ ద్వారా రాజమండ్రి వాస్తవ్యులు ఎస్ఎల్జి గ్రూప్స్ అధినేత మల్లిడి వీర రాఘవరెడ్డికి తెలుపగా వారు వెంటనే స్పందించి మేము సైతం ఫౌండేషన్ ద్వారా నిత్యవసర సరుకులు ఇప్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్జి గ్రూప్ సభ్యులు జయరాం, కిషోర్, భూపతి రమేష్, యాదల సుధీర్, మెకానిక్ శివ, వెంకట శివ, వెంకటరమణ రాజు పాల్గొన్నారు.

నేడు చీరాలకు సీఎం చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

చేనేతల మధ్య జరుపుకుంటారని మంత్రి సవిత చెప్పారు. మధ్యాహ్నం మూడు గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చీరాలకు వస్తారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేనేతలకు పెద్దపీట వేసినట్లు చెప్పారు. బీమా పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని చేనేతలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కె సునీత, రాష్ట్ర కమిషనర్ జి రేఖారాణి, చీరాల, బాపట్ల శాసనసభ్యులు ఎం మాల కొండయ్య, వేగేశన నరేంద్ర వర్మ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ ప్రతిఘటన దళితుల జన్మ హక్కు

ప్రజా సంఘాల ఐక్యవేదిక

విశాలాంధ్ర-ఒంగోలు : చుండూరు మృతవీరుల 33వ వర్ధంతి కార్యక్రమం, ప్రజా యుద్ధనౌక గద్దర్ ప్రథమ వర్ధంతి కార్యక్రమం మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట మంచి పుస్తకం షాపు దగ్గర ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్ రావు మాట్లాడుతూ 1991 ఆగస్టు 6 గుంటూరు జిల్లా చుండూరులో అగ్రకుల పెత్తందారులు మాలపల్లిపై దాడి చేసి అతి కిరాతకంగా 11 మందిని నరికి వేసిన రక్త చరిత్ర అని అన్నారు. హత్య జరిగి 33 సంవత్సరాలు గడిచిన నేటికీ దోషులకు శిక్ష పడలేదని హంతకులంతా నిర్దోషులైతే చుండూరి నెత్తురు నేరం ఎవరిదని ఆయన ప్రశ్నించారు. నేటికీ ఓట్లు వెయ్యలేదని తమ పెత్తందారితనాన్ని ప్రశ్నిస్తున్నారని మాల మాదిగల పల్లెలపై నిరంతరంగా దాడులు జరుగుతున్నాయని అన్నారు. కుల అసమానతలు వివక్షత దోపిడీ వ్యతిరేకంగా పోరాడటం ఆత్మరక్షణ ప్రతిఘటన దళితుల జన్మ హక్కుని ఎలుగెత్తి చాటాలని ఎక్కడ దాడులు జరిగినా సమైక్యంగా తిప్పి కొట్టాలని అదే చుండూరు మృత వీరులకు నిజమైన నివాళం అన్నారు. ప్రజా యుద్ధనౌక కామ్రేడ్ గద్దర్ భారత విప్లవోద్యమంలో ప్రధానంగా సాంస్కృతిక రంగంలో ఒక ఒరవడిని సృష్టించాడని దోపిడి వివక్షత పేదలకు వ్యతిరేకంగా తన కలంతో గళంతో ఒక చరిత్రను సృష్టించారని ఆయన మార్గంలో ఆయన స్ఫూర్తిని తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముందుగా చుండూరు మృతవీరులకు, కామ్రేడ్ గద్దర్ కు ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సిపిఐ ఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి జార్జి, జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షులు చుండూరు రంగారావు, సీనియర్ కమ్యూనిస్టు నాయకులు కొంగర నరసింహం, నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు ధరణికోట లక్ష్మీనారాయణ, డిహెచ్ పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కరువది సుబ్బారావు, ఐఎల్పి రాష్ట్ర అధ్యక్షులు దాసరి సుందరం, రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ పేరయ్య, రిటైర్డ్ గెజిటెడ్ సంఘం రాష్ట్ర నాయకులు ఏ సలార్, సిపిఎంఎల్ లిబరేషన్ నాయకులు పివి రమణారెడ్డి, సిపిఐ పట్టణ కార్యదర్శి పివిఆర్ చౌదరి, ఏఐటీసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, బి టి ఏ రాష్ట్ర నాయకులు సువర్ణ బాబు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు తోరటిఆనంద్ పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా సాధించాలి - వీరారెడ్డి

విశాలాంధ్ర-కొండెపి : భారత కమ్యూనిస్టు పార్టీ కొండెపి మండల సమితి సమావేశము మంగళవారం కొండెపిలోని కూనంనేని రాములు భవన్లో కొచ్చర్ల మాలకొండయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ కొండెపి నియోజకవర్గ కార్యదర్శి కే వీరారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనాలు చేకూర్చలేదు. పోలవరం ముంపు బాధితులకు నష్టపరిహారం కానీ, ప్రాజెక్టు నిర్మాణానికి బడ్జెట్లో నిధులు కేటాయింపు చేయలేదు. రాజధాని నిర్మాణానికి కూడా ప్రపంచ బ్యాంకు దగ్గర 30 సంవత్సరాలలో తీర్చే విధంగా అప్పు మాత్రమే కేంద్ర ప్రభుత్వం హామీతో ఇప్పించింది. కానీ గ్రాంట్ గా ఇచ్చినట్టుగా ప్రచారం చేసుకుంటున్నది. ఆంధ్రప్రదేశ్లో పరిశ్రమల నిర్మాణం జరగాలన్న, నిరుద్యోగ సమస్య పోవాలన్నా ప్రత్యేక హోదా సాధించాలి. తద్వారా పరిశ్రమలు నెలకొల్పితే రాయితీలతో కూడినటువంటి ఇతర సౌకర్యాలు వస్తే మన రాష్ట్రంలో పరిశ్రమలో స్థాపించడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తారు. తద్వారా రాష్ట్ర ఆదాయం పెరగడమే కాకుండా రాష్ట్రంలోనే నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కూడా మెరుగుపడతాయి. కొండెపి చెరువులో కలపను నరికి అక్రమంగా తరలించిన వారిపై పోలీసు కేసు నమోదు చేసి వారిపై చర్యలు తీసుకోవాలి, కర్రలు స్వాధీనం చేసుకోవాలి, అక్రమంగా కలప నరికిన వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి అని వీరారెడ్డి డిమాండ్ చేశారు. రాబోయే వ్యవసాయ సీజన్కు తగ్గట్టుగా వ్యవసాయ శాఖ అధికారులు ఎరువులను విత్తనాలను సిద్ధం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి గద్దల బాలకోటయ్య, మండల కార్యదర్శి లక్ష్మీ, ప్రసాదు, చంద్రయ్య, ఖాసీం, బ్రహ్మయ్య,ఎల్లమంద, సాయి, జాలయ్య, సుబ్బారావు, లక్ష్మీ మొదలగు వారు పాల్గొన్నారు.

డిగ్రీ 2వ సెమిస్టర్‌లో 'శ్రీసాధన' అద్భుత ఫలితాలు

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ 2వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో స్థానిక శ్రీసాధన డిగ్రీ కళాశాల విద్యార్థులు 91 శాతం సగటు ఉత్తీర్ణతతో అద్భుత ఫలితాలు సాధించారని కళా శాల ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ తెలిపారు. బి.య.స్సి బోటనీ, విభాగంలో కన్నె దారి అంజలి 850 మార్కులకు 749 సాధించి 88 శాతం మార్కులతో అగ్రస్థానం సాధించగా, బి.కామ్ కంప్యూటర్ విభాగంలో ఈపూరి ధనలక్ష్మి 800లకు 713 మార్కులు, బి.య.స్సి జువాలజీ విభాగంలో షేక్ మహాబూబి ఆసాని 850 మార్కులకు 711., బి.య.స్సి కంప్యూటర్స్ సైన్సు విభాగంలో షేక్ సాజిదా 800 లకు 697 మార్కులు, బి.య.స్సి కెమిస్ట్రీ విభాగంలో పసుపులేటి శిరీష (జువాలజీ మైనర్) 850లకు 680, ఐనోలు వెంకట రమణ (గణితశాస్త్రం మైనర్) 800 మార్కులకు 655 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థాయిలో నిలిచారని ప్రిన్సిపల్ మధుసూదన్ అన్నారు. సబ్జెక్టుల వారిగా 196 పేపర్లలో 90పైగా మార్కులు సాధించడం పట్ల కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీధర్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న పోటీప్రపంచంతో వివిధ ప్రభుత్వ లేక ఐటి రంగంలో ఉపాధిని కైవసం చేసు కోవడంలో అనునిత్యం కళాశాల నుండి తర్ఫీదు పొందుతూనే అకడమిక్స్‌ను సైతం వదిలిపెట్టకుండా ఉన్నత స్థాయి మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్తో పాటు సెక్రెటరీ అండ్ కరెస్పాండెంట్ డి రాజగోపాల్ రెడ్డి, డైరెక్టర్లు వి.ఆర్.కె ప్రసాద్, ఎం.వి కృష్ణారెడ్డి, డాక్టర్ వెన్నా కృష్ణారెడ్డి, జి.యల్ రమేష్ బాబులతోపాటు వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీధర్ కుమార్, ప్లేస్ మెంట్ సెల్, సాక్, అకడమిక్ ఆర్డినేటర్లు కె.పవన్ కుమార్, డాక్టర్ ఎం. శేషుకుమార్, పి.రామకృష్ణప్రసాద్ అభినందించారు.

టీ-5 కాలువను చిన్నకండ్లేరు వరకు పొడిగించాలి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : టీ5 కాలువను చిన్నకండ్లేరు వరకు పొడిగించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం యర్రగొండపాలెంలోని సీపీఐ కార్యా లయంలో సీపీఐ మండల సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టు పూర్తయితే పశ్చిమ ప్రాంత ప్రజలకు త్రాగు, సాగునీరు అందుతుందని అన్నారు. వెలుగొండ ప్రాజెక్టు గత పాలకుల నిర్లక్ష్యం వలన నత్తనడక నడుస్తుంది నూతనంగా ఏర్పడిన టిడిపి ప్రభుత్వం వెలుగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేసి, మార్కాపురం జిల్లా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో ఎన్నో సంవత్సరాల నుంచి అపరిశుభ్రతంగా ఉన్న గంజివారిపల్లి కోటగట్ల రిజర్వాయర్ ను పార్వులేశ్వర్ ట్యాంకుగా అభివృద్ధి పరచాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి మౌలిక సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 2 జడ్పిటిసిలు, 10 ఎంపిటిసిలు, 30 వార్డులకు పోటీ చేయాలని సమావేశంలో తీర్మానించడం జరిగింది. పార్టీని బలోపేతం చేయడానికి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి ప్రజా సమస్యలు తీసుకొని పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీపీఐ సీనియర్ నాయకులు టిసిహెచ్ చెన్నయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.వి.కృష్ణ గౌడ్, నక్కా తిరుపతయ్య, వై వెంకట శివయ్య, త్రిపురాంతకం మండల కార్యదర్శి రామయ్య, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు సాంబయ్య, ప్రసాదు, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండల కేంద్రమైన ముళ్ళమూరులో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున మురుగు నీరు పారుదల లేక దోమల ఉత్పత్తి చెందుతూ ప్రజలను అల్లాడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. వీధులలో, రోడ్ల వెంబడి చెత్తాచెదారం తొలగించడంతోపాటు, కాలువలలో పూడికలు, చెత్తను తొలగిస్తున్నారన్నారు. అలాగే రోడ్లకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లిస్తున్నామన్నారు.

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలపై అవగాహన

విశాలాంధ్ర-ముండ్లమూరు : స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం మండలంలోని అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు స్కూల్ మేనేజ్ మెంటు కమిటీ ఎన్నికలపై ఎంఈఓ (2) కే వెంకటేశ్వర్లు అవగాహన కల్పించారు. ఈ నెల 8న జరగనున్న ఎస్ఎంసి కమిటీ ఎన్నికపై విధి విధానాలను వివరించారు. మండలంలో మండల ప్రాథమిక పాఠశాలలు 52, ప్రాథమికోన్నత పాఠశాలలు8, ఉన్నత పాఠశాలలు 8, మొత్తం 68 పాఠశాలల్లో ఎన్నికలు జరుగుతాయని, పేరెంట్ కమిటీ ఎన్నికలకు విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఎస్ఐ వి నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ పేరెంట్స్ కమిటీ ఎన్నికల సందర్భంగా ఎలాంటి ఘర్షణలకు పాల్పడకుండా గ్రామాల్లోని ప్రజలు శాంతియుతంగా ఓటింగ్ లో పాల్గొనాలని ఆయన అన్నారు. ఎన్నికల్లో పాల్గొనే తల్లిదండ్రులు ఆధార్ కార్డు లేదా ఓటర్ కార్డుతో సంప్రదించాలని సూచించారు.

పెద్దమ్మ తల్లి గుడిలో చోరీ

నిందితులను అరెస్ట్ చేసిన ఎస్ఐ

విశాలాంధ్ర-పుల్లలచెరువు : మండలంలోని మల్లాపాలెం గ్రామంలో శ్రీ పెద్దమ్మ తల్లి గుడిలో జులై 20 తారీకు కానుక హుండీని పగలగొట్టి నగదు దొంగిలించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఎస్సై ఫిరోజ్ ఫాతిమా మరియు సిబ్బంది మల్లా పాలెం బ్రిడ్జి సమీపంలో ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి వారి నుండి దొంగిలించిన 58 వేల రూపాయలు నగదును స్వాధీనపరచుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచారు పరిచినట్లు ఎస్సై తెలిపారు

నూతన తహశీల్దార్‌గా ఎండీ నయీమ్

విశాలాంధ్ర-పుల్లలచెరువు : పుల్లలచెరువు మండల నూతన తహశీల్దార్‌గా ఎండి నయీమ్ అహ్మద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. తహసీల్దార్ ఎన్నికల ముందు ముండ్ల మూరు మండలంలో విధులు నిర్వహిస్తూ ఎన్నికల సమయంలో పల్నాడు జిల్లా నూజెండ్ల మండలానికి వెళ్లారు. అనంతరం ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా నూజండ్ల మండలం నుండి పుల్లల చెరువుకు వచ్చారు. ఈ సందర్భంగా ఎండి నయామ్ అమ్మద్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ప్రజా సమస్యల వేదికలో రైతులు, ప్రజల నుండి వచ్చే వినతులు, ఫిర్యాదులను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర-చీమకుర్తి : జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో జరుగుతున్న అక్రమ రేషన్ బియ్యం తరలిస్తున్న వారిపై నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. రాత్రి అందిన సమాచారం మేరకు సుమారు రెండు గంటల సమయంలో చీమకుర్తి పట్టణంలోని బూచేపల్లి సుబ్బారెడ్డి వెంకాయమ్మ కళ్యాణ మండపం పక్కన రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని అదుపులోకి తీసుకోని లారీలోని సరుకును పరిశీలించగా సుమారు 120 బస్తాల రేషన్ బియ్యం ఉన్నట్టుగా గుర్తించి దీనికి కారణమైన వారిపై సంబంధిత కేసులను నమోదు చేయడం జరిగింది. సంతనూతలపాడు నియోజకవర్గంలో ఇప్పటికీ 8 కేసులు పెట్టడం జరిగిందిని, చీమకుర్తి రేషన్ షాప్ నుండి అక్రమ రేషన్ తరలిస్తున్న వెహికల్‌ను సీజ్ చేయడం కూడా జరిగిందని, ఈ సందర్భంగా సంతనూతలపాడు నియోజకవర్గ రేషన్ మాఫియాకి తెలియజేయడ మేమనగా ప్రజా పంపిణీకి సంబంధించిన రేషన్ బియ్యం, ఇతర వస్తువులు ఏవైనా అక్రమంగా తరలించడం చట్టరీత్యా నేరం కాబట్టి ఇటువంటి చర్యలకు పాల్పడవద్దని ప్రభుత్వం కూడా ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోమని ఆదేశాలు జారీ చేసింది కాబట్టి ఎవరు ఇటువంటి చర్యలకు పాల్పడవద్దని ఎన్ఫోర్స్మెంట్ డి.టి. కృష్ణమోహన్ తెలియజేశారు.

డబ్బా పాలు వద్దు..తల్లి పాలే ముద్దు

టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి

విశాలాంధ్ర-దొనకొండ: మీ చిన్నారులకు డబ్బా పాలు పట్టవద్దని, తల్లి పాలే పట్టించాలంటూ దర్శి నియోజకవర్గ తెదేపా ఇన్‌చార్జీ డా.గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు కె.సునీత ఆధ్వర్యంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాల ముగింపు సభలో ఆమె మంగళవారం పాల్గొని మాట్లాడారు. బిడ్డ పుట్టిన రోజు నుండే తల్లి పాలు అందించాలని, రోగ నిరోధక శక్తిని అందించే గుణం తల్లి పాలలోనే ఉందన్నారు. బిడ్డకు పాలు ఇచ్చే ముందు చేతులు శుభ్రంగా కడగాలన్నారు. ప్రతి రెండు గంటలకు తల్లిలో పాల ఉత్పత్తి జరుగుతుందని, పాలు పట్టించక పోతే తల్లి రొమ్ములో మార్గం మూసుకు పోతుందని, దీంతో పాల గడ్డలు ఏర్పడి కేన్సర్‌కు దారి తీసే అవకాశం ఉందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య శాఖ, అంగన్‌వాడీ, ఆశాల ద్వారా అందిస్తున్న వివిధ సేవలను సద్వినియోగం చేసు కోవాలంటూ లక్ష్మి కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.రమాదేవి, వైద్యురాలు సునీత, సీడీపీఓ భారతీ, సూపర్‌వైజర్ ప్రభావతిదేవి, వైద్య సిబ్బంది, బాలింతలు, గర్భవతులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు

విశాలాంధ్ర-గిద్దలూరు : గిద్దలూరు పోలీసులు మానవత్వం చాటుకున్నారు. ఓ వృద్ధుడు చెత్త కుప్పలో పడి ఉన్న విషయాన్ని గుర్తించి గిద్దలూరు అర్బన్ సీఐ సోమయ్యకు సమాచారం అందించారు. దీంతో సిఐ సోమయ్య ఆదేశాల మేరకు వృదుడు ఉన్న ప్రాంతానికి చేరుకున్న పోలీసులు వృద్ధుడు ఉన్న పరిస్థితిని చూసి చలించి పోయారు. వృద్ధుడు మూగవాడు కావడంతో అతను ఎక్కడ నుంచి వచ్చాడో ఎందుకు ఇక్కడ ఉన్నాడో చెప్పలేని పరిస్థితిలో ఉన్న విషయాన్ని గుర్తించారు. వృద్ధుడిని స్థానికంగా ఉన్నా సంజీవిని వృద్ధాశ్రమానికి తరలించి ఆశ్రయం కల్పించారు.వృద్ధుడి బంధువులు కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకునేందుకు సీఐ సోమయ్య ప్రయత్నించిన ఫలితం కనిపించలేదు. వృద్ధుడు తన కుటుంబ సభ్యులు పట్టించుకోరని ఇక్కడే అనాధాశ్రమంలో ఉంటానని సైగలు చేస్తూ పోలీసులకు తెలిపాడు. దిక్కు తోచని స్థితిలో పడి ఉన్న వృద్ధుడిని సీఐ సోమయ్య పోలీసు సిబ్బంది అనాధాశ్రమంలో ఆశ్రయం కల్పించడంపై స్థానిక ప్రజలు పోలీసులపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

అధిక దిగుబడులపై రైతులకు అవగాహన

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిని ఎలా సాధించాలి అనేదానిపై రైతులకు అవగాహన కార్యక్రమం దోర్నాల వ్యవసాయ అధికారి డీ.జవహర్లాల్ నాయక్ నిర్వహించారు. మండలంలోని జమ్మిదోర్నాల గ్రామంలో వ్యవసాయ శాఖ వారు పొలం బడి ప్రదర్శన క్షేత్రం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి జవహర్ లాల్ నాయక్ రైతులకు పొలం బడి యొక్క ముఖ్య ఉద్దేశం తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించడం పొలం బడి యొక్క ముఖ్య ఉద్దేశం. అలాగే భూసారా పరీక్ష ఫలితాల ఆధారంగా పంటల సాగు మరియు ఎరువుల యాజమాన్యం పాటించాలని, మట్టి నమూనా సేకరణ, గురించి రైతులకు అనగాహనా కల్పించారు. అలాగే ప్రస్తుతం వర్షా భావ పరిస్థితులు దృష్ట్యా రైతులు ప్రత్తి పంటకు బదులుగా కంది, మినుము పంటలు సాగు చేయాలనీ, సాగు చేసిన పంటలు ఈ -పంట నమోదు చేసుకోవాలని రైతులకు తెలియజేసారు. 30శాతం రాయితీపై కంది, మినుము విత్తనాలు పంపిణి చేస్తున్నట్లు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు యం. రాజేంద్ర ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

టెలిఫోన్ రంగ ఉత్పత్తుల పెంపుపై పార్లమెంటులో ఎంపీ మాగుంట ప్రశ్న

విశాలాంధ్ర-ఒంగోలు :

దేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ లో టెలిఫోన్ రంగంలో ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకం కింద టెలిఫోన్ మరియు నెట్ వర్క్ ఉత్పాదక సామర్ధ్యత పెంపు కొరకు రాయితీలు పొందుటకు దరఖాస్తు చేసిన సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా సంస్థలు సంఖ్య, ఆమోదం పొందినవి, విడుదలచేసిన నిధులు, ఉత్పత్తులు, తయారీ, మరియు ఎగుమతుల గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు.దీనికి కేంద్ర

సమాచార గ్రామీణాభివృద్ధి శాఖ సహాయక మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ సమాదానమిస్తూ దేశంలో టెలిఫోన్ రంగంలో ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకం క్రింద టెలిఫోన్ మరియు నెట్ వర్క్ ఉత్పాదక సామర్ధ్యత పెంపు కొరకు రాయితీలు పొందుటకు 28 సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా సంస్థలు రాయితీలు పొందాయని, అందులో డిల్లీలో 14, కర్నాటకలో 4, హర్యానాలో 2, మహారాష్ట్రలో 2, గోవాలో 1, గుజరాత్ లో 1, హిమాచల్ ప్రదేశ్ లో 1, కేరళలో 1, తెలంగాణలో 1 మరియు వెస్ట్ బెంగాల్ లో 1 రిజిస్టర్డ్ ఆఫీసులు వున్నాయని, దేశం మొత్తంలో మరి 42 దరఖాస్తులు ఆమోదించబడగా ఆంధ్రప్రదేశ్ సంబంధించి ఏమీ లేవని తెలిపారు.ఈ పథకం క్రింద రూ.11,244 కోట్లు నిధులు కేటాయించబడగా, రూ. 332 కోట్లు నిధులు విడుదలచేయడం జరిగిందని మరియు 31-05-2024 నాటికి రూ.304 కోట్లు పెత్తుబడితో రూ.3,469 కోట్లు అమ్మకాలు జరిగాయని తెలిపారు. ఈ పథక లబ్దిదారులకు పోటీతత్త్వం మరియు ఎగుమతి సామర్ధ్యం పెంపుదలకు డిజైన్ తయారీ క్రింద ఒక శాతం అధిక ప్రోత్సాహంతో పాటు అదనపు ఉత్పత్తులకు అనుమతి కూడా కల్పించబడిందని కేంద్ర మంత్రి తెలియజేశారు.

పెళ్లిళ్లకు మంచి ముహూర్తాలు ఇవే

విశాలాంధ్ర-కొమరోలు : శ్రావణమాసం రావడంతో శుభకార్యాలకు ముహూర్తాలు వచ్చాయని పండితులు తెలిపారు. ఆగస్టు 7 నుంచి 28 వరకు పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు లాంటి శుభకార్యాలు నిర్వహించుకోవచ్చని చెప్పారు. ఆగష్టు 7, 8, 9, 10, 11, 15, 17, 18, 22, 23, 24, 28 తేదీలు మంచివి అని 17, 18 తేదీలు అత్యంత శుభ ముహూర్తాలు అని వివరించారు. కాగా గురు,శుక్ర మూఢాలు రావడం వల్ల గత 3 నెలలుగా వివాహాలకు బ్రేక్ పడింది.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

విశాలాంధ్ర- పీసీపల్లి : మండల పరిధిలోని దివాకరపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన పోలినేని మల్లికార్జున మండల విద్యాశాఖ అధికారులు సంజీవి శ్రీనివాసులు చేతుల మీదుగా మంగళవారం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పాఠశాలల విద్యార్థులకు సొంత నిధులతో సమకూర్చిన నోటు పుస్తకాలను అందించిన మల్లికార్జునకు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు చేయూత నందించడం అంతేకాకుండా ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని విని యోగించుకొని ఉన్నతంగా చదవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అరుణ ఉపాధ్యాయురాలు శ్రీవేణి విద్యా కమిటీ చైర్మన్ మల్లికార్జున హరి బ్రహ్మయ్య విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పీసీపల్లి నూతన తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన ఉష

విశాలాంధ్ర-పీసీపల్లి : పిసిపల్లి మండల నూతన తహశీల్దారుగా సిహెచ్ ఉష మంగళవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఆరవ పద్మావతి తిరుపతి జిల్లా ఓజిలి మండలానికి తహశీల్దార్‌గా బదిలీ కావడంతో ఆమె స్థానంలో సత్తెనపల్లి మండల తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సిహెచ్ ఉష పీసీపల్లికి బదిలీపై వచ్చారు. తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది నూతన తహశీల్దార్ కు ఘనంగా స్వాగతంపలికి శుభాకాంక్షలు తెలిపారు. తహశీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. తహసిల్దార్ కు స్వాగతం పలికిన వారిలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు వీఆర్వోలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-పీసీపల్లి : నేడు పీసీపల్లి మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకట సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10. 30 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరుగుతున్నట్లు తెలిపారు. స్థానిక శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని కావున మండల అధికారులు తమ శాఖపరమైన ప్రగతి నివేదికలతో హాజరుకావాలని పేర్కొన్నారు. సమావేశానికి కిందిస్థాయి అధికారులను పంపించవద్దని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : సీజనల్ వ్యాధులు, దోమ కాటు వల్ల వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని చింతల వైద్యాధికారి డాక్టర్ యాగ్నిక్ తెలియజేశారు. డాక్టర్ యాగ్నిక్ మాట్లాడుతూ దోమల నియంత్రణకు దోమతెరలు వాడాలని, ఇంటి చుట్టు పక్కల పరిసరాల పరిశుభ్రతను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే, ఆరోగ్య పరిరక్షణ అనే అంశాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు ఆ అంశాలను అమలు పరచాలని తెలిపారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేయించాలని సూచించారు. దోమల నివారణకు మలాథియన స్ప్రే చేయటం వలన నివారించవచ్చు అన్నారు.జ్వర పీడితులను గుర్తించి, వారికి మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధి నిర్ధారణ పరీక్షలు స్థానిక ప్రభుత్వ వైద్యశాల యందు రక్త పరీక్షలు చేయించుకోవాలని తెలియజేశారు.పాజిటివ్ ఉన్నవారికి అవసరమైన చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన పెంపొందించుకొని జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే ని డ్రై డేగా పాటించాలని చెప్పారు. జ్వరాలు రాకుండా, సీజనల్ వ్యాధుల భారీన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కాచి చల్లార్చిన క్లోరినేషన్ చేసిన నీటిని త్రాగాలని అన్నారు. ఆహారంపై ఈగలు వాలకుండా మూతలు పెట్టి ఈగలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. తినే ఆహారం పట్ల మరింత జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పాఠశాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చూసించారు. బాల బాలికలు విద్యార్థి దశ నుండే ఆరోగ్య సూత్రాలు పాటించాలని సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు వెళ్లినట్లయితే తగిన ఫలితాలను రాబట్టవచ్చని ప్రజలకు సూచించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంత గూడాలలో ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల, వర్షాల వల్ల, సీజన్ వ్యాధులు ప్రభులే అవకాశం ఉన్నందున, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెలియజేశారు. ఏదో జ్వరము వచ్చినచో అందుబాటులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చి చూయించుకోవాలని తెలియజేశారు. దోమ కార్డు వల్ల జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందున, దోమతెరలను వదలని తెలియజేసారు.

ప్రైవేటు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే 'ఉడుముల'

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని బచ్చల కూరపాడు పంచాయతీలో గల మెట్టువారిపల్లెకు చెందిన అమెరికాలో నివాసం ఉంటున్న కాసు వెంకటేశ్వర్‌రెడ్డి స్వగ్రామమైన మెట్టువారిపల్లిలో నూతనంగా నిర్మించిన భవన గృహప్రవేశం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ గృహప్రవేశానికి కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి, నాయకులు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితనయుడు కందుల విగ్నేష్‌రెడ్డి నారాయణరెడ్డి సోదరుడు కందులు రామిరెడ్డి, మార్కాపురం కందులు ఓబుల్ రెడ్డి ఆసుపత్రి చైర్మన్ కందులు గౌతం నాగిరెడ్డి ,మాజీ ఎంపీపీ మాదాల బ్రహ్మయ్య, మండలమాజీ ఉపాధ్యక్షుడు సాని కొమ్ము వెంకటేశ్వర్ రెడ్డి, పలువురు నాయకులు, బంధువులు మిత్రులు గృహప్రవేశానికి హాజరై కాసు వెంకటేశ్వర్ రెడ్డి నూతన గృహప్రవేశానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. తొలుత కాసు దంపతులు సత్యనారాయణ వ్రతము చేశారు.అనంతరం విందు ఘనంగా నిర్వహించారు.

భవిత కేంద్రం, హిందూ పాఠశాలలో తనిఖీ

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని ఎదుర్రాళ్లపాడులో గల భవిత కేంద్రం, హిందూ పాఠశాలను, ఐఈఏఎంఓ కోఆర్డినేటర్, రమేష్ ఎంఈఓ 2 నరసింహారావులు, మంగళవారం తనిఖీ చేశారు. భవిత కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించారు. వారికి పలు సూచనలు సలహాలు చేశారు. అనంతరం హిందూ పాఠశాలను తనిఖీ చేసి లెసన్ ప్లాన్స్, ఉపాధ్యాయుల డైరీలు క్రమం తప్పకుండా రాయాలన్నారు. ఒకటవ తరగతి విద్యార్థులు 90 రోజుల్లో విద్యా ప్రవేశ, కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో జరిగేలా చూడాలని ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ రావు, ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ఐ ఈ ఆర్ టి లు, బేరం పద్మజ, జయలక్ష్మి సిఆర్‌పి కిరణ్‌లు పాల్గొన్నారు.

'ఈ- పంట'లో నమోదు చేసుకోవాలి

టంగుటూరు మండల వ్యవసాయ అధికారి జి.స్వర్ణలత

విశాలాంధ్ర-టంగుటూరు : ప్రతి రైతు తప్పనిసరిగా తాము సాగు చేసే పంటలను ఈ పంటలో నమోదు చేసుకోవాలని టంగుటూరు మండల వ్యవసాయ అధికారి జి స్వర్ణలత అన్నారు. మండలంలోని ఆలకూరపాడు గ్రామంలో మంగళవారం పచ్చిరొట్ట పంటలను మరియు నువ్వు పంటలను వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి పచ్చిరొట్ట పంటల వలన భూసారం పెంపొందించవచ్చునని రైతులకు తెలియజేశారు. పంటలను ఈ పంటలో నమోదు చేసుకోవడం ద్వారా పంట బీమా పంట నష్టం అన్నదాత సుఖీభవ వంటి వివిధ పథకాలకు అర్హులవుతారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలకూరపాడు గ్రామ రైతులు ఆలం రామారావు చిడిపోతూ కృష్ణయ్య బదుగు వేణు నార్నె వెంకటేశ్వర్లు వాక అంజిరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధి కమిటీ ఎన్నికలు

ఎంఈఓ మస్తాన్ నాయక్

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : ఈ నెల 8వ తారీఖున నిర్వహించే పాఠశాల అభివృద్ధి కమిటీ ఎన్నికలు ఎన్నికలు షెడ్యూలు ఆధారంగా నిర్వహించాలని ఎటువంటి తప్పిదాలు లేకుండా పదవులు ఎన్నుకోవాలని ఎంఈఓ మస్తాన్ నాయక్ తెలిపారు. మంగళవారం దోర్నాలలోని గవర్నమెంట్ హైస్కూల్ నందు నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో గౌరవ మండల విద్యాశాఖ అధికారి బి. మస్తాన్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ నెల 8/8/24 నా నిర్వహించే పాఠశాల అభివృద్ధి కమిటీ ఎన్నికలు ఎన్నికల షెడ్యూల్ ఆధారంగా నిర్వహించాలని ఎటువంటి తప్పిదలు లేకుండా చైర్మన్ వైస్ చైర్మన్ ని ఎన్నుకోవాలని తెలిపారు. అలాగే మండల విద్యాశాఖ అధికారి 2 ఎం.కొండలరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు టి.ఐ. యస్.అప్డేట్ చేసుకోవాలని ఎటువంటి తప్పులు లేకుండా ఉపాధ్యాయుల వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-టంగుటూరు : ప్రమాదవశాత్తు చెరువులో కాలుజారి ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన టంగుటూరులో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు మరియు కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు, టంగుటూరు వాణి నగర్‌కు చెందిన కాకి అంజయ్య (60) సోమవారం రాత్రి తన వ్యక్తిగత పనులు నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తూ తన ఇంటి ప్రాంగణంలో ఉన్న చెరువులో కాళ్లు కడుగుకొనుటకు ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడిపోయాడు. రాత్రి సమయం కావడంతో ఎవరు గుర్తించలేకపోవడం వలన ఆయన మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు తెలిపారు. ఉదయాన్నే టంగుటూరు చెరువు మీదకు వాకింగ్ కు వచ్చే స్థానిక ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడు టంగుటూరు వాణి నగర్ కు చెందిన కాకి అంజయ్య గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్ కు తరలించారు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ప్రమాదవశాత్తు మరణంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టంగుటూరు ఎస్సై పున్నారావు తెలిపారు.

పంట నమోదుతో ప్రయోజనాలు

విశాలాంధ్ర-పర్చూరు: రైతులు వేసిన పంటలను నమోదు చేయటం ద్వారా బహుళార్థక ప్రయోజనాలు ఉంటాయని బాపట్ల జిల్లా మాస్టర్ ట్రైనర్ వి.కిరణ్‌కుమార్ తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలోని రైతు సేవా కేంద్రంలో పంట నమోదుపై ఏడీఏ మోహనరావు అధ్యక్షతన శిక్షణా కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజనులో రైతులు సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేయాలని సూచించారు. పంట నమోదుతో రైతులకు ప్రభుత్వం వారు అందించే పంట నష్టపరిహారం, భీమా పథకం, పంట రుణాలు, పంట కొనుగోలు, అన్నదాత సుఖీ భవ పథకాలు వర్తించే విధానంను పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో అవగాహన కలిగించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు నాగభైరు మోహనరావు మాట్లాడుతూ అర్హత కలిగిన కౌలు రైతులందరికి కార్డులతోపాటు రుణాలు ఇప్పించాలని తెలిపారు. ఆర్ఎస్‌కే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి పంటలపై సలహాలు, సూచనలు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఇంకొల్లు, యద్దనపూడి, కారంచేడు మండలాల వ్యవసాయ అధికారులు వేణుగోపాల్, ఆదినారాయణ చౌదరి, సుధీర్‌బాబు, వీఏఏలు, వీహెచ్ఏలు, ఎంపీఈఓలు ఉన్నారు.

వీఆర్ఓ సస్పెండ్

విశాలాంధ్ర-కొల్లూరు : ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో నిర్లక్ష్యధోరణిని అవలంభించిన వీఆర్ఓను సస్పెండ్ చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు జారీ చేసిన ఆదేశాల మేరకు.. మంగళవారం వీర్ఓను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు కొల్లూరు తహశీల్దార్ బి. వెంకటేశ్వర్లు తెలిపారు. రెవెన్యు కార్యాలయంలో ఆయన నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, కొల్లూరు మండలపరిధిలోని పెసర్లంక-పెదలంక అరవింద వారధి వద్ద జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను నిరోధించేందుకు పెదలంక వీఆర్ఓ కె. నరేంద్ర నేతృత్వంలో నిఘా బృంధాన్ని అధికారులు నియమించారు. అయితే ఆప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు పలు పత్రికల్లో కథనాలు వెలువడటంతో రేపల్లె ఆర్డీఓ హేలా షారోన్ శనివారం ఆప్రాంతాన్ని పరిశీలించి వీఆర్ఓపై చర్యలకు ఆదేశించారు. వీఆర్ఓ నిర్లక్ష్యధోరణిని తీవ్రంగా పరిగణించిన జిల్లా అధికారులు సస్పెండ్ చేస్తూ ఆదేశాలిచ్చారు. వీఆర్ఓతోపాటు, విధులలో ఉన్న పెదలంక వీఆర్ఏ ఎ.గురవయ్య, రావికంపాడు ఇంజనీరింగ్ అసిస్టెంట్ జి.నాగరాజులకు షోకాజ్ నోటీసులు అందజేసినట్లు తహశీల్దార్ తెలిపారు.

చేరెడ్డి వెంకటేశ్వరరెడ్డికి నివాళి

విశాలాంధ్ర-గిద్దలూరు : పొదలకుంటపల్లె గ్రామానికి చెందిన మండల ఎంపీపీ కడప లక్ష్మి తండ్రి చేరెడ్డి వెంకటేశ్వరరెడ్డి (65) గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, గిద్దలూరు నియోజకవర్గ వైసిపి ఇంచార్జి కుందురు నాగార్జున రెడ్డి మంగళవారం మృతుని స్వగృహానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి మనోధైర్యాన్ని కల్పించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పార్థివ దేహానికి మండల మాజీ ఎంపీపీ కడప వంశీధర్ రెడ్డి,వైసీపీ నాయకులు కృష్ణారెడ్డి,నల్లగుంట్ల ఎంపీటీసీ వెంకటేశ్వర్ రెడ్డి,డిష్ ఓబుల్ రెడ్డి తదితరులు ఘనంగా నివాళులర్పించారు.

సీఎం పర్యటన జయప్రదం చేయాలి: కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. చీరాల మండలం జాండ్రపేట గ్రామం బట్ట వీరన్న అండ్ బీరక నాగయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాటు చేయనుండగా జిల్లా అధికారులతో అత్యవసర సమావేశం మంగళవారం ఆ పాఠశాలలోనే నిర్వహించారు. తదుపరి పాఠశాల ఎదురుగా ఉన్న చేనేత కార్మికుల గృహాలను ఏపి సమాచార పౌర సంబంధాల శాఖ రాష్ట్ర సంచాలకులు హిమాన్షు శుక్లా, జిల్లా కలెక్టర్ వెంకట మురళి కలిసి సందర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సందర్శించే చేనేత కార్మికుల జీవన స్థితిగతులు, ఆర్థిక పరిస్థితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను అధికారులు శరవేగంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పటిష్టమైన భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. హెలిప్యాడ్ వద్ద భద్రతకు ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలన్నారు. చీరాలలో చేనేత కార్మికులు అధికంగా ఉన్నందున ఈ ప్రాంతంలోనే జాతీయ చేనేత దినోత్సవం అధికారికంగా ప్రభుత్వం నిర్వహిస్తున్నదన్నారు. బాపట్ల జిల్లాకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలిసారిగా రావడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. చెట్లను నరకడం, స్థంభాలను తొలగించడం వంటివి చేయరాదని స్పష్టం చేశారు. పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి సమస్య లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. సీఎం సభ ప్రాంగణంలోకి జాండ్రపేట వాసులకు మాత్రమే అనుమతి ఉంటుందని, ఇతర ప్రాంతాలలోని వారిని అనుమతించేది లేదని ఆయన స్పష్టం చేశారు. సభ ప్రాంగణం వద్ద పారిశుధ్య చేపట్టాలని, ముఖ్యంగా త్రాగునీటి సమస్య లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సభ ప్రాంగణంలో చేనేతలతో మాట్లాడతారని ఆయన తెలిపారు. సమావేశంలో ఏపీ రాష్ట్ర చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కె సునీత, రాష్ట్ర కమిషనర్ జి రేఖారాణి, ఎస్పీ తుషార్ డూడి, జిల్లా సంయుక్త కలెక్టర్ బి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో భార్యభర్తలు మృతి

విశాలాంధ్ర - రేపల్లె : కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యాభర్తల మధ్య తీవ్ర వాగ్వాదం జరగడంతో ఆవేశానికి గురైన భర్త కర్రతో బలంగా కొట్టడంతో తీవ్ర గాయాలకు లోనైన భార్య అక్కడికక్కడే మృతిచెందింది. దీంతో భర్త ఆవేశానికి గురై పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం రేపల్లె మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం రేపల్లె మండ లంలోని మైనేని వారి పాలెం గ్రామానికి చెందిన వాకా బాబురావు (55) భార్య మహాలక్ష్మి (50) ల మధ్య మనస్పర్థలు కారణంగా బాబురావు కర్రతో బలంగా భార్యను కొట్టడంతో తీవ్రగాయాలు రక్తస్రావం కాగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన చూసిన బాబురావు భార్య మృతితో తీవ్ర మనస్థాపానికి గురై పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు రేపల్లె పోలీసులు తెలిపారు. మృతులకు ముగ్గురు మగ పిల్లలు ఉన్నారు, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతి చెందిన భార్యాభర్తల మృతదేహాలను రేపల్లె ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు నుంచి జారిపడి అస్సాం వ్యక్తి మృతి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల మండలం కొండు బొట్ల వారిపాలెం సోమవారం రాత్రి గౌహతి నుంచి బెంగళూరు ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి అస్సాం రాష్ట్రానికి చెందిన బాబు లాల్ ముర్ము తండ్రి బుధారి ముర్ము (31) మృతి చెందారు. నేపాల్ పురి గ్రామం ఉదల్‌గురి జిల్లా సంభందించిన వారు బంధువులతో కలసి జీవనోపాధి నిమిత్తం ఆదివారం అస్సాంలో గౌహతి ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరి కూలి పనుల నిమిత్తం వెళుతున్నారని రూరల్ పోలీస్ స్టేషన్ సిఐ వై . శ్రీహరి కి తెలిపారు. బెంగళూరుకు వెళుతుండగా గత రాత్రి సుమారు ఒకటిన్నర రెండు గంటల సమయంలో ప్రమాదవశాత్తు ట్రైన్ నుంచి జారి కింద పడడం వలన దెబ్బలకు అక్కడి నుంచి లేచి నడుచుకుంటూ వస్తూ బాపట్ల మండలం కొండు బొట్ల పాలెం గ్రామ లోకి వచ్చే క్రమంలో గ్రామ పొలాల్లో పడిపోయి మరణించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ విషయమై వారి బంధువులు అందరితో మాట్లాడి సమాచారాన్ని నిర్ధారించుకున్న మీదట బాపట్ల గవర్నమెంట్ రైల్వే పోలీస్ వారికి తెలియపరచగా వారు వచ్చి ఆ మృతదేహాన్ని స్వాధీనం పరుచుకున్నారు. దానిమీద జీఆర్పి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారన్నారు.

క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తు

విశాలాంధ్ర-పామూరు : క్రమశిక్షణతో నైపుణ్యముతో కూడిన విద్యను అభ్యసించి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు ఏర్పాటు చేసుకోవాలని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఒక ప్రైవేట్ కళాశాల విద్యార్థులు పువ్వాడి రాదయ్య ఫంక్షన్ హాలులో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రణాళికబద్ధంగా ఇష్టముతో చదవాలన్నారు. విద్యార్థులకు ఇంటర్మీడియట్, డిగ్రీ విద్య కీలకమని,పెడదారి పట్టకుండా సత్ప్రవర్తనతో మెలిగి ఉన్నత స్థాయికి చేరుకొని పేరు ప్రతిష్టలతో తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజయతలకు బహుమతులను ఉగ్ర నరసింహ రెడ్డి చేతుల మీదగా అందజేశారు. అతిధులకు కళాశాల యాజమాన్యం జ్ఞాపకలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, యారవ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ లు డి వినోహోర్, కావటి సుబ్బయ్య, ఉప్పలపాటి హరిబాబు, అదుచల్లి ప్రభాకర్ చౌదరి, పండిటి హరీష్, గుంటుపల్లి శ్రీనివాసులు, షేక్ కాజా రహమతుల్లా, పాలకుర్తి వెంకటేశ్వర్లు, మోరబోయిన హుస్సేన్ రావు యాదవ్, ఇరి కోటిరెడ్డి, పోతరాజు వెంకట్రావు, జాజం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

విశాలాంధ్ర - బల్లికురవ : రైతులు ఖరీఫ్ లో సాగు చేసిన పంటలన్నీ ఈ పంటలో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్పిపి కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కొప్పెరపాలెం గ్రామంలో ఈ పంట నమోదు కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఈ రోజు నుండి మండల పరిధిలోని అన్ని రైతు రైతు భరోసా కేంద్రాలలో పంట నమోదు చేస్తున్నారని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంటలు సాగుచేసిన రైతులు రైతు భరోసా కేంద్రం సిబ్బందికి పంటల వివరాలు తెలిపి పంట నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదు ఆధారంగానే ప్రభుత్వం నుంచి వచ్చే ఇన్పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్, పంటల కొనుగోలు మొదలైనవి అమలు చేస్తారని తెలిపారు. కౌలు రైతులు రెవెన్యూ శాఖ వీఆర్వో ద్వారా కౌలు కార్డు పొంది రైతు పేరుతో పంట నమోదు చేయించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఏఏ భాషా, రైతులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : తల్లిపాలు అమృతంతో సమానమని మంతెనవారిపాలెం గ్రామ సర్పంచ్ ఎల్.ఆదిలక్ష్మి, వెంకటపతి రాజు అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని మంతెనవారిపాలెంలో తల్లిపాల ఆవశ్యకతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవని చెప్పారు.తల్లిపాలు బిడ్డకు ఇవ్వడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డకు అనారోగ్యాల నుంచి దూరం చేస్తుందన్నారు. తల్లిపాలు సహజ సమతుల్య ఆహారమని చెప్పారు.వీటిద్వారా శక్తితోపాటు ఎన్నో విలువైన పోషకాలు బిడ్డకు అందుతాయన్నారు. తల్లులు తప్పనిసరిగా తమ శిశువులకు తల్లిపాలే ఇవ్వాలని దీంతో బిడ్డకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు వి.రాధ, ఎ.అరుణకుమారి, పంచాయతీ కార్యదర్శి కే.వసుంధర, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్వాడి కార్యకర్తలు, సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు శ్రేష్టం

విశాలాంధ్ర-ముండ్లమూరు : బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలు ఇస్తే ఆ బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటుందని ఉల్లగల్లు సెక్టార్ సూపర్వైజర్ బి సునీత అన్నారు. మండలంలోని ఉల్లగల్లు కొత్తూరు అంగన్వాడి కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు ఎంతో శ్రేష్టమని అన్నారు. బిడ్డకు పాలు ఇచ్చేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్త గురించి వివరించారు. బిడ్డకు ఆరు నెలలు నిండే వరకు తల్లిపాలు తాగించాలన్నారు. ఆరు నెలలు నిండిన తర్వాత అనుబంధ ఆహారం పెట్టాలన్నారు. రెండు సంవత్సరాల నిండే వరకు తల్లిపాలు తాగించాలన్నారు.

చేనేత పరిశ్రమను రక్షించుకుందాం

- చేనేత వస్త్రాలు ధరిద్దాం
- పరిశ్రమ ఉనికి కాపాడుకుందాం
- నేడు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

విశాలాంధ్ర - రేపల్లె : 1905. ఆగస్టు 7న ప్రారంభించిన స్వదేశీ ఉద్యమం దేశీయ పరిశ్రమలను ముఖ్యంగా చేనేత కార్మికులను ప్రోత్సహించింది. 2015లో భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయిం చింది. అప్పటినుండి ప్రతి సంవత్సరం ఆగస్టు 7న దేశవ్యా ప్తంగా జాతీయ దినోత్సవం అని జరుపుకుంటున్నారు. భారత స్వాతంత్ర ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించి స్వాతంత్ర సముపార్జనకు ఒక సాధనంగా నిలిచింది చేనేత. గాంధీజీ కూడా రాట్నంపై నూలు వడగటానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. అంతటి ప్రాధాన్యత కలిగిన చేనేత రంగానికి ఒకరోజు ఉండాలని ఉద్దేశంతో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఆగస్టు 7న జరుపుకుంటున్నాం. స్వాతంత్ర ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించి స్వాతంత్ర సముపార్జనకు ఒక సాధనగా నిలిచింది. చేనేత భారత స్వాతంత్ర ఉద్యమంలో చేనేత అహింసాయిత ఉద్యమానికి నాంది పలికిన చేనేత రంగాన్ని ఒకరోజు ఉండాలని ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్రానికి చెందిన రాపోలు ఆనంద భాస్కర్ 2005లో చేనేత దినోత్సవానికి సంబంధించిన పరిశోధన చేసి చారిత్రిక ఆనవాళ్లను శోధించాడు. చేనేత దినోత్సవంకి సరైన తేదీ కోసం అధ్యయనం చేశాడు, భారత స్వాతంత్ర ఉద్యమం జరుగుతున్న సమయంలో విదేశీ వస్త్రాలను బహిష్కరించాలన్న లక్ష్యంతో స్వదేశీ ఉద్యమం వచ్చింది. మొదటిసారిగా 1905 ఐదులో బెంగాల్లో రాష్ట్ర రాజధాని కలకత్తాలోని టౌన్ హాల్లో ఆగస్టు 7న భారీ సమావేశం నిర్వహించి విదేశీ వస్త్రాలను బహిష్కరించడంతోపాటు దేశీయ ఉత్పత్తుల పునరుద్ధరణకు పిలుపు ఇచ్చారు. అలా విదేశీ వస్తు బహిష్కరణలో కీలక పాత్ర వహించిన ఆగస్టు నెల జాతీయ దినోత్సవంగా చేయాలని ఆనంద్ భాస్కర్ ప్రతిపాదించాడు. ఆనంద్ భాస్కర్ ప్రతిపాదనను కేంద్ర మంత్రివర్గం ఆమోదించి అన్ని రాష్ట్ర ప్రభుత్వాల, కేంద్ర పాలిత ప్రాంత ప్రభుత్వాల అంగీకారంతో 2015 జూలై 29వ తేదీ భారత ప్రభుత్వం ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవంగా జరపాలని నిర్ణయించింది. గత టిడిపి ప్రభుత్వంలో చేనేత సంఘాలని ఆదుకుని ప్రజలకు పని కల్పించడానికి నిధులను ఇచ్చి సంఘాలను ఆదుకుని కార్మికులు నుండి తయారు చేసిన వస్త్రములను ఆప్కో ద్వారా మరి 20 శాతం డిస్కౌంట్‌తో వస్త్రములు విక్రయాలు జరుపుకోవడానికి అనుమతి ఇవ్వటం జరిగినది. ఇదే కాదు అప్పుడు టిడిపి ప్రభుత్వం ప్రజలకు ధర అందుబాటులో ఉండటానికి యారన్‌కి ఒక కిలోకి 5 శాతం సబ్సిడీ ఇచ్చి మరి సీసీ 3కి ఇంట్రెస్ట్ సబ్సిడీ ఇచ్చి సంఘాలు ఆదుకోవటం జరిగింది. ఇల్లు లేని చేనేత కార్మికుడికి హౌసింగ్ స్కీమ్ ద్వారా సబ్సిడీతో ఇల్లుకు మంజూరు చేయటం, కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్పులు ఇచ్చారు. మన వస్త్రాల నైపుణ్యత పెంచాలనే ఆలోచనతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు నచ్చే విధంగా వస్త్రం తయారు చేయడానికి ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసి, రెండు నెలలు ట్రైనింగ్ ఇచ్చి వాళ్లకి ప్రతి నెల జీతం ఇచ్చి కొత్త రకమైన డిజైన్లు నేర్పారు. 2019 నుండి రాష్ట్రంలో ఉన్న చేనేత సంఘాలు వైసీపీ ప్రభుత్వంలో అనేక రకాలుగా ఇబ్బంది పాలవటం జరిగింది. ఇప్పుడు చేనేత పరిశ్రమను గతపూర్వ వైభవం తేవడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ద్వారా చేనేత పరిశ్రమ పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి జరుగుతున్నది. చేనేత కార్మికులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి చేనేత కార్మికుల ఆకలి, చావులు, ఆత్మహత్యలను, అరికట్టాలని ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ చేనేత సహకార సంఘాలకు దశాబ్ద కాలంగా పాలకవర్గ ఎన్నికలు నిర్వహించకపోవడంతో కార్మికులు, సహకార సంఘాలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే గత ఐదు సంవత్సరాలుగా రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలకు వివిధ రాయితీల రూపంలో ప్రభుత్వం చెల్లించవలసిన 106 కోట్ల రూపాయల బకాయిలు నిలిచిపోవడంతో సహకార సంఘాలు కార్మికులకు ఉపాధి చూపలేక పోతున్నాయని దీంతో ఉపాధిని కోల్పోయిన కార్మికులు అప్పుల ఊబిలో కూరుకుపోతూ ఆత్మహత్యలకు ఆకలి చావులకు బలవుతున్నారని ఆయన ఆవేదన చెందారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం తక్షణమే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించడంతోపాటు వారి బకాయిలను వెంటనే చెల్లించాలని, మగ్గం ఉన్న ప్రతి చేనేత కార్మికుని కుటుంబానికి నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అమలు చేయాలని, చేనేత ప్రసూతి మహిళలకు నెలకు రూ. 5వేలు వంతున ఆరు నెలల పాటు ఆర్థిక సహాయాన్ని అందించాలని, చేనేతపై కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్టీని రద్దు చేయాలని, 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, అర్హులైన చేనేత కార్మిక చేనేత కార్మికులకు మూడు సెంట్లు ఇంటి స్థలం మంజూరు చేసి పక్కా ఇల్లు, వర్క్ షెడ్ ప్రభుత్వం ఉచితంగా నిర్మించాలని వస్త్రాల అమ్మకంపై 20 శాతం రాయితీ ఇవ్వాలని సొసైటీలలో పేరుకుపోయిన వస్త్ర నిల్వలను వెంటనే కొనుగోలు చేయాలని ఆప్కో బకాయిలు విడుదల చేయాలని సబ్సిడీ పావలా వడ్డీ త్రిఫ్ట్ ఫండు విడుదల చేయాలని ఆయా చేనేత సొసైటీల ప్రతినిధులు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జి. బాలాజీ ఈ సందర్భంగా రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలను కోరారు.

తల్లిపాలు బిడ్డకు ప్రాణాధారం

విశాలాంధ్ర-పామూరు: తల్లిపాలు బిడ్డకు ప్రాణాధారమని అమృతంతో సమానమైన, తల్లిపాలు పుట్టిన బిడ్డకు తప్పని సరిగా తాగించాలని అంగన్వాడీ పామూరు సెక్టార్ సూపర్ వైజర్ గోళ్ళ పద్మజ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక పవర్ ఆఫీస్, ఇస్లాంపేట పరిధిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న బాలింతలతో పద్మజ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించడం శ్రేయస్కరమని తెలిపారు. అమృతంతో సమానమైన ముర్రుపాలు తాగించడం వల్ల పుట్టిన బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. బిడ్డకు తల్లిపాలు పుష్కలంగా అందించాలంటే తల్లి సమతుల్యమైన పౌష్టికాహారం తీసుకోవాలని సూపర్వైజర్ పద్మజ సూచించారు. అంగన్వాడీల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకొని తల్లి, బిడ్డ సురక్షితంగా ఆరోగ్యం కాపాడుకోవాలని కోరారు. తల్లిపాల ప్రాధాన్యత గురించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ అనూషా, అంగన్వాడీ కార్యకర్తలు షేక్ రమిజాబీ, షేక్ రూహి, అంగన్వాడీ హెల్పర్స్ షంషాద్, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర-జరుగుమల్లి : మండల పరిధిలోని పలు గ్రామాలలో బుధవారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని జరుగుమల్లి సబ్ స్టేషన్ ఏఈ హర్షిత్ తెలిపారు. నందనవనం, కలికివాయ, రామనాదపురం. 11 కెవి కరెంట్ తీగల కింద ఉన్న చెట్లు కొట్టుట వలన విద్యుత్ అంతరాయం కలుగుతుందని విద్యుత్ వినియోగదరులు దీనిని గమనించగలరని పేర్కొన్నారు.

నేతన్నల హామీలు అమలు చేయనున్న సీఎం

- ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య
- చంద్రబాబు పర్యటన విజయవంతం చేయాలని పిలుపు

విశాలాంధ్ర - చీరాల : చేనేతలు అధికంగా ఉన్న చీరాలలోనే జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు ఇచ్చారని, చీరాల నియోజక వర్గ ప్రజలకు ప్రతిపక్ష నేతగా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ నెరవేరుస్తారని చీరాలలో టెక్స్ టైల్ పార్కు ఏర్పాటు చేస్తారని చీరాల శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్య అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చీరాలలో సభ ఏర్పాట్లను చేనేత జౌళి శాఖ మంత్రి సవితతో కలిసి మంగళవారం చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా చేనేత జౌళి శాఖ మంత్రి సవిత మాట్లాడుతూ చేనేత ఉత్పత్తులకు బ్రాండ్ ఇమేజ్ కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. జాండ్రపేట హైస్కూల్ ప్రాంగణంలో సభా వేదికకు సంబంధించిన అన్ని ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించడం జరిగిందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేటి సభలో నేరుగా చేనేతలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటారన్నారు. చేనేత మగ్గాలను, చేనేత వస్త్రాలను ముఖ్యమంత్రి పరిశీలించనున్నారని, జాతీయ చేనేత దినోత్సవం చీరాలలో జరపడం పట్ల చేనేతలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రేమను ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. దేశంలో వ్యవసాయం తరువాత చేనేత రంగం పెద్దదని గత ఐదేళ్ల జగన్ ప్రభుత్వంలో చేనేత రంగం పూర్తిగా నిర్వీర్యం అయ్యి చేనేతలు కులవృత్తిని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వ విధానాలలో చెనతలకు ముడి సరుకులేక, అధిక విద్యుత్ ఛార్జీలు కట్టలేక చాలామంది చేనేతలు ఆత్మహత్యలు కూడా చేసుకున్నార్నన్నారు. ప్రజల మధ్యకు రావాలంటే గత ముఖ్యమంత్రి చెట్లు నరికి పరదాలు కట్టుకొని వచ్చేవారని, ప్రజా ప్రభుత్వం వచ్చాక ప్రజల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాదాసీదాగా నేడు జనంలో తిరుగుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ, మాజీ మంత్రి బాచిన చెంచు గరటయ్య, జిల్లా కలెక్టర్ మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ తుషార్ డూడి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వర రావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు సజ్జా హేమలత, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు: ఎస్పీ

విశాలాంధ్ర - బాపట్ల : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం చీరాల నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించడం కొరకు, ప్రయాణీకులు సులభంగా గమ్యస్థానానికి చేరే విధంగా స్వల్పంగా ట్రాఫిక్ దారి మళ్లింపు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన జరుగుతున్న కొద్దిసేపు మాత్రమే ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటాయన్నారు. సామాన్య ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులకు గురికాకూడదనే ఉద్దేశంతో వారి సౌకర్యార్థం వాహనాలను దారి మర్లచడం జరిగిందన్నారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ సూచించారు.

వాహనాల దారి మళ్లింపు వివరాలు ఇవీ..

- చీరాల పట్టణం నుండి వయా జాండ్రపేట మీదుగా వేటపాలెం వెళ్లే వాహనాలను, వేటపాలెం నుండి వయా జాండ్రపేట మీదుగా చీరాల వెళ్లు వాహనాలను దారి మళ్లించడం జరుగుతుందన్నారు.
- చీరాల పట్టణం నుండి వయా జాండ్రపేట మీదుగా వేటపాలెం వెళ్లే వాహనాలను జాండ్రపేట హై స్కూల్ వద్ద నుండి అక్కయ్యపాలెం రోడ్డు మీదుగా రాష్ట్రీయ రహదారి 216 నుండి వేటపాలెంకు దారి మళ్లించడం జరిగింది.
- వేటపాలెం నుండి వయా జాండ్రపేట మీదుగా చీరాల వైపు వెళ్లే వాహనాలను వేటపాలెం మెయిన్ సెంటర్ నుండి రాష్ట్రీయ రహదారి 216 మీదుగా చీరాల పట్టణంకు దారి మళ్లించడం జరిగింది.



వికలాంగులను చైతన్యపరచాలి

విశాలాంధ్ర-సంతనూతలపాడు : మానసిక వికలాంగులను మరింతగా చైతన్య పరచాలని జిల్లా మానసిక వైద్య విభాగం కౌన్సిలర్స్ బి అనిల్ కుమార్ ఎస్ ఏడుకొండలు కోరారు. జాతీయ మానసిక అవగాహన దినోత్సవంలో భాగంగా స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ నందు మంగళవారం వైద్య సిబ్బందికి అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి సిహెచ్ఓ ఆర్ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక వికలాంగులు మూఢనమ్మకాలను విడనాడి మానసిక సృజనాత్మక పై అవగాహన పెంచాలి అన్ని విధాలుగా వారిలో చైతన్యం మానసిక రోగం పట్ల విముక్తి కలిగించాలన్నారు. మానసిక వైద్య నిపుణులు జి.చంద్రశేఖర్ మానసిక రోగాల పట్ల విముక్తి కొరకు టె లియానాస్ మొబైల్ నెంబర్ 14416కి ఫ్రీ కాల్ సెంటర్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పి హెచ్ ఎన్ ఎల్ పద్మావతి ఫార్మసీ ఆఫీసర్ వి వెంకటేశ్వ రావు ఏఎన్ఎం ఆశా వర్కర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఐ హాజరత్తయ్యకు సన్మానం

విశాలాంధ్ర-జరుగుమల్లి : నూతనంగా నియమితులైన సింగరాయకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ హాజరత్తయ్య పరిశీనలో భాగంగా జరుగుమల్లి పోలీస్ స్టేషన్ను మంగళవారం విజిట్ చేశారు. ఈ నేపథ్యంలో జరుగుమల్లి మండల టీడీపీ సాంస్కృతిక విభాగ అధ్యక్షులు రావిపాటి శేషయ్య సీఐ హాజరత్తయ్యను మర్యాద పూర్వకంగా కలిసి వారిని సన్మానించారు. ఈ క్రమంలో ఇరుపార్టీ నాయకులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ మండల పరిధిలోని ఎక్కడ నేరపూరిత ఘటనలు చేటుచేసుకోకూడదని, అలా ప్రవర్తిం చిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఎలాంటి సమస్య అయినా మమ్మల్ని సంప్రదిస్తే తగు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. రికార్డులు పరిశీలిం చిన పిదప యాస్పై వెంకటేశ్వరావు ను వారి సిబ్బందిని అభినందించింది, అక్రమ ఇసుక, అక్రమ మద్యం మరియు మాదక ద్రవ్యాలపై నిఘా ఉంచాలని హెచ్చరించారు.

చుండూరు మాలల రక్తదారల ఫలితమే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్

విశాలాంధ్ర-ఒంగోలు : చుండూరు మాలల రక్తధారరల ఫలితమే నేటి దళితుల వజ్రాయుధం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ అని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు అన్నారు. మంగళవారం ఒంగోలు పట్టణంలోని తన కార్యాలయంలో చుండూరు మాలలకు నివాళి అర్పించిన అనంతరం, నాగేంద్ర విలేకరులతో మాట్లాడారు. 1991 ఆగస్టు 6న చుండూరు నరమేధం జరిగిందన్నారు. దళిత ఉద్యమ చరిత్రను మార్చి రాసిన ఈ నరమేధంలో 8 మంది అక్కడికక్కడే మరణించారన్నారు. ఎ దిల్లీలో జరిగిన చుండూరు దళితుల నిరసన సభలో మాజీ ప్రధాని వి.పి.సింగ్ మాట్లాడారన్నారు. 106 మంది ఎస్సీ ఎస్టీ ఎంపీలు రాష్ట్రపతి ఆర్ వెంకట్రామన్ అపాయింట్మెంట్ కోసం రాష్ట్రపతి తలుపులు తెరుచుకోలేదన్నారు. దీంతో దళితులు రాష్ట్రపతి కావాలని డిమాండ్ తెరపైకి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలోనే కేరళకు చెందిన కేఆర్ నారాయణన్ రాష్ట్రపతి అయ్యారన్నారు. దళిత ఉద్యమ చరిత్రలో అనేక చారిత్రాత్మక మలుపులకు ఘట్టాలకు చుండూరు మాలల త్యాగం, చుండూరు ఉద్యమం కారణమయ్యాయి అన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షులు దారా అంజయ్య, అంబేద్కర్ యూత్ సొసైటీ అధ్యక్షులు వేలూరి శ్రీనివాస్, దళిత నాయకులు కాకుమాను రవి పాల్గొని ప్రసంగించారు.

నిబద్ధతతో విధులు నిర్వహించాలి: ఎస్పీ

విశాలాంధ్ర - బాపట్ల : విధులు పట్ల ఎవరైనా అలసత్వం ప్రదర్శిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీసులను హెచ్చరించారు. జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని బుధవారం బాపట్ల జిల్లాకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచ్చేయనున్న నేపథ్యంలో మంగళవారం చీరాల సెంటెన్స్ కళాశాల ప్రాంగణంలో జిల్లా ఎస్పీ బందోబస్త్ విధులు నిర్వహించనున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి బ్రీఫింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టిన అనంతరం మొట్టమొదటి సరిగా బాపట్ల జిల్లాలో పర్యటిస్తున్నారన్నారు. దానికి అనుగుణంగా సుమారు 700 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. హెలిప్యాడ్ వద్ద, రూఫ్ టాప్‌లలో, కాన్వాయి పార్టీ లో, ట్రాఫిక్ దారి మళ్లింపులలో, సభా వేదిక వద్ద విధులు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రతిక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ట్రాఫిక్, పార్కింగ్ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. సామాన్య ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ దారి మళ్లించాలన్నారు. అందరూ సమయపాలన పాటిస్తూ, డ్యూటీ పాస్ పోర్ట్ లో ఎవరికి నిర్ణయించిన ప్రదేశాలల్లో వారు పూర్తి సామర్థ్యంతో, పూర్తి స్పష్టతతో బందోబస్త్ విధులు నిర్వహించాలన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో సమస్యని వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. విధులు పట్ల ఎవరైనా అలసత్వం ప్రదర్శించిన, గైర్హాజరు అయిన శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి టి.పి.విఠలేశ్వర్ గారు, రేపల్లె, చీరాల, బాపట్ల డీఎస్పీలు, బందోబస్తు విధులకు హాజరైన పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - రేపల్లె : కృష్ణానది పెనుమూడి వరద పరివాహక ప్రాంతంలోని ప్రజలు, పాఠశాల విద్యార్థులు, పల్లెపాలెం గ్రామ నదీ పరివాహక ప్రాంత ప్రజలు, అప్రమత్తంగా ఉండాలని రేపల్లె మండల తహశీల్దార్ మోర్ల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం రేపల్లె మండలం పెనుమూడి - పల్లిపాలెం గ్రామ ప్రజలకు కృష్ణానదిలో నుండి వరద ఉధృతి అధికంగా వచ్చినప్పుడు మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు. పెనుమూడి గ్రామంలోని ఎంపీపీ ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, పెనుమూడి - పల్లెపాలెం మత్స్యకారుల కాలనీలో నివసిస్తున్న ప్రజలు సురక్షితగా ఉండే విధంగా సమీపంలోని ఉన్నత పాఠశాలలో పునరావాసి కేంద్రంలో ఏర్పాటు చేయడం జరిగిందని, వరద నీటి ప్రవాహం ఎక్కువగా వచ్చినప్పుడు పల్లెపాలెం మత్స్యకారుల కాలనీ ఇళ్లల్లోకి వరదనీరు చేరడంతో వారు చాలా ఇబ్బందులు పడుతుంటారు. ఈ విషయాన్ని గమనించి తాసిల్దార్ శ్రీనివాసరావు పలు సూచనలు, సలహాలు వారికి తెలియజేశారు. ప్రస్తుతం నాగార్జునసాగర్ నుండి ప్రకాశం బ్యారేజ్ కృష్ణానదికి ఐదు లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల అయినందున వరద ప్రభావం ఎక్కువగా ఉండవచ్చునని, అందుకు ముందు జాగ్రత్తగా కృష్ణా నది పరివాహ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసేందుకు తాసిల్దార్ తగు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా పెనుమూడి కృష్ణ నది సముద్ర ప్రాంతంలో ఎలాంటి ఇబ్బందులు ప్రజలకు ఏర్పడకుండా ఉండేవిధంగా సహాయక చర్యలు మరియు పునరావాస కేంద్రాలకు వెళ్లి అక్కడ తలదాచుకోవాల్సిందిగా తాసిల్దారు వారందరికీ తగు సూచనలు చేశారు. పెనుమూడి గ్రామ వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులు, ఆర్ సి అధికారులు, పోలీసులు తాసిల్దార్ వెంట ఉన్నారు.

కమ్యూనిటీ హాల్ తాళాలు గ్రామ పెద్దలకు అప్పగించాలి

విశాలాంధ్ర - రేపల్లె : సింగుపాలెం దళితవాడలో ఉన్న కమ్యూనిటీ హాల్‌కు నిబంధనలకు విరుధంగా దళితవాడ మీద వివక్ష చూపిస్తూ పంచాయతీ అధికారులు తాళాలు వేయటాన్ని నిరసిస్తూ గ్రామ దళితులు తిరగబడ్డారు. మంగళవారం కమ్యూనిటీ హాలుని దళితడ వాడలోని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రేపల్లె మండలం ఇఓపిఆర్డి మల్లికార్జునరావుకు, రేపల్లె మండల తాహసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రాలు అందచేసి ఫోన్ ద్వారా రేపల్లె ఎంపీడీవో, తాహసిల్దారులకు సమస్యను తెలియజేయడం జరిగిందని సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో సింగుపాలెం దళితవాడలో నిర్మాణం చేసిన కమ్యూనిటీ హాల్ ని అప్పటినుండి ఆ గ్రామపెద్దలు,వివిధ సామాజిక అవసరాల కోసం, ఆ గ్రామంలో చర్చి నిర్వాహకులు విశ్రాంతికి ఉపయోగించుకుంటున్నారు, అటువంటి కమ్యూనిటీ హాల్‌కి సిమ్ గ్గుపాలెం గ్రామంలో అధికార పార్టీ రాజకీయ పెద్దలు కమ్యూనిటీ హాలుకి తాళాలు వేయమన్నారని, అంటూ గత జూలై మొదటి వారంలో అప్పటి పంచాయతీ కార్యదర్శి అధికార దుర్వినియోగం చేసి కమ్యూనిటీ హాల్ నిర్వాహిస్తున్న స్థానిక పెద్దలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా, తాళాలు వేసి రాజకీయ పలుకుబడి నాయకులుతో చెప్పించడి అంటు వాడుకలో ఉన్నా కమ్యూనిటీ హాల్ నీ నిరుపయోగంగా మార్చారు. 2014 నుంచి సింగు పాలెం దళితవాడలో కమ్యూనిటీ హాల్ నీ ఆ గ్రామ ప్రజలు వారి వారి అవసరాల నిమిత్తం ఉపయోగించుకోవటానికి, ఈ కమ్యూనిటీ హాలుకు మహిళలు సైతం మరుగుదొడ్లు, మంచినీళ్ళ, నాపరాళ్ళు లాంటివి నేరుగా దళితవాడాలో ప్రజలే సుమారు లక్ష రూపాయల వరకు ఖర్చు చేసి అభివృద్ధి చేసుకున్నారు. ఈ 10 సంవత్సరాలు కాలంలో కమ్యూనిటీ హాల్ నిర్వహణకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదులు లేవు. కావాలానే దళితవాడ మీద వివక్షతో అధికారులు కమ్యూనిటీ హాలుకు తాళాలు వేసినట్లు ఉందని మణిలాల్ విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా లేదా, రేపల్లె నియోజకవర్గంలో ఉన్నా దళితవాడలో కమ్యూనిటీ హాల్స్ అని కూడా ఆ గ్రామ సంఘపెద్దలు లేదా కమ్యూనిటీ హాల్ నిర్వహణ కమిటీ పెద్దలా ఆధ్వర్యంలో నిర్ణయం చేసుకొని ఆ గ్రామప్రజలే నిర్వహించుకోవటం జరుగుతుంది. కానీ సింగుపాలెం దళితవాడలో దానికి విరుద్ధంగా వ్యవహరించటం అంటే బాధ్యతారహితమని అధికారులు కలగచేసుకుని సమస్యను పరిష్కారం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగుపాలెం గ్రామ సంఘపెద్దలు గోనే.సోమయ్య, గాలి.రామకోటి, సముద్రాల.సీనియర్,గాలి.ఏసోబు, కే.కోటేశ్వరరావు, గాలి.దానియేలు, తదితరులు పాల్గొన్నారు.

కళాశాల స్థల కేటాయింపునకు కృషి చేస్తాం : ఎరిక్షన్ బాబు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : దోర్నాల పట్టణంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు సహకరించాలని కోరుతూ దోర్నాల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సూరగాని సావిత్రి మరియు సిబ్బంది యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబుకి వినతిపత్రం అందించారు. ఇప్పటివరకు జూనియర్ కళాశాలలోనే డిగ్రీ కళాశాలను నడుపుతున్నామని సరైన సౌకర్యాలు, గదులు లేకపోతే ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వ దృష్టికి డిగ్రీ కళాశాల సమస్యను తీసుకెళ్లి పరిష్కార మార్గాన్ని చూపాలని కోరారు. ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ దోర్నాలలో డిగ్రీ కళాశాల నిర్మాణానికి స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని, విద్యా శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి డిగ్రీ కళాశాల స్థల కేటాయింపు, కళాశాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం: సర్పంచ్

విశాలాంధ్ర-మార్కాపురం : తాను సర్పంచి పదవి అడ్డం పెట్టుకొని ఎటువంటి భూ అక్రమాలకు పాల్పడినా తనపై చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చని బోడపాడు సర్పంచి ఎం.రమణారెడ్డి పేర్కొన్నారు. ఆయన మంగళవారం సాయంత్రం మీడియాతో మాట్లాడుతూ సోమవారం మా గ్రామానికి సంబంధించిన మా బంధువులు కొందరు వారి భూములు ఆక్రమించుకున్నానంటూ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేయడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. మా మామ, ఆయన కూతురి కోసం ఇచ్చిన భూమిని తాను ఎలా ఆక్రమించుకున్నట్లు చెప్తారని ప్రశ్నించారు. గ్రామంలో లేదా మండలంలో ఎప్పుడైనా, ఎక్కడైనా తాను తన అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఎవరి భూములను ఆక్రమించి ఉన్నట్లయితే నిరూపించుకోవాలని ఈ సందర్భంగా సవాల్ విసిరారు. అలా నిరూపించ గలిగితే తాను ఏ శిక్షకైనా సిద్ధంగా ఉన్నానంటూ రమణారెడ్డి స్పష్టం చేశారు. కావాలని తనపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పంట నమోదు ఎంతో ఉపయుక్తం

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలోని అంబవరం మరియు వెలుపల్లి రైతు సేవా కేంద్రాలలో మండల వ్యవసాయ అధికారి విజయ భాస్కర్‌రెడ్డి ఈ-పంట నమోదు ప్రక్రియను పరిశీలించి రైతులకు ఈ-పంట నమోదు యొక్క ఉపయోగాలను వివరించారు. ప్రస్తుతం గ్రామ వ్యవసాయ సహాయకులు మరియు గ్రామ రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఈ-పంట నమోదు కార్యక్రమం జరుగుతున్నది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో పంటలు వేసిన ప్రతి ఒక్క రైతు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సూచించారు. ఈ పంట నమోదు చేసుకోవడం వలన పంటలు ఎప్పుడైనా అతివృష్టి మరియు అనావృష్టికి లోనైనప్పుడు ప్రభుత్వం ద్వారా అందించు పంట నష్టపరిహారం,పంటల భీమా, ధాన్యం కొనుగోలు మొదలైనవి వర్తించాలంటే తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి మీరు ఏ ఏ పంటలు వేశారు అనేది అప్లికేషన్ ద్వారా వారికి అందజేసిన యెడల వారు మీ పొలానికి వచ్చి తనిఖీ చేసి పంట నమోదు చేస్తారు అని తెలియజేశారు. వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి,గ్రామ వ్యవసాయ సహాయకులు శేఖర్, మొహమ్మద్ నూర్, రైతులు పాల్గొన్నారు.

చేనేత సొసైటీలకు ప్రభుత్వం రాయితీలు ఇవ్వాలి

- ఇసుకపల్లి చేనేత సొసైటీలో పేరుకుపోయిన వస్త్ర నిల్వలు
- మేనేజర్ శోభన్‌బాబు

విశాలాంధ్ర - రేపల్లె : దేశంలో వ్యవసాయం తర్వాత అతి పెద్ద రంగం చేనేత, అలాంటి చేనేతరంగాన్ని గత ఐదు సంవత్స రాలుగా చేనేత పరిశ్రమను, సొసైటీలను పట్టించుకున్న పాలకులే లేరని చేనేత కార్మి కులు, చేనేత సహకార సంఘాల తాత్కాలిక పాలకవర్గ కమిటీ ప్రతినిధులు ఆరోపిస్తు న్నారు. సొసైటీలకు దాదాపు ఏడు సంవత్స రాల నుండి బాపట్ల జిల్లాలో సుమారు రెండు కోట్ల రూపాయలు మేరకు బకాయిలు సొసైటీలకు చెల్లించవలసి ఉందని, ఇందులో రేపల్లె - ఇసుకపల్లి చేనేత సహకార సొసైటీకి సుమారు 25 లక్షల రూపాయలు రాష్ట్ర ప్రభు త్వం నుండి బకాయిలు రావాల్సి ఉన్నాయని సొసైటీ మేనేజర్ కే శోభన్ బాబు తెలిపారు. గత ప్రభుత్వంలో చేనేత పరిశ్రమకు గాని సొసైటీ గాని ఎలాంటి రాయితీలుగాని, సౌకర్యాలు గాని, మౌలిక వసతులు గాని కల్పించిన దాఖలాలు లేవని, సొసైటీలకు పండుగ సీజన్లో ఇచ్చే 20 శాతం రాయితీ పూర్తిగా నిలిపివేశారని, అదేవిధంగా సొసైటీలో వస్త్ర నిల్వలు పేరుకుపోయి ఉన్నాయని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఆప్కో నుండి సొసైటీలకు రావలసిన బకాయిలు గాని, వస్త్ర కొనుగోలు చేయటం గాని, ఇంతవరకు జరగలేదని దీనివలన కార్మికులు నేసిన వస్త్రాలు, దుప్పట్లు, లుంగీలు, టవల్స్, సొసైటీలో లక్షలాది రూపాయల్లో పేరుకుపోయి ఉన్నాయనారు. పండుగ సీజన్లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీ కూడా నేటి వరకు అమలుపరిచిన సందర్భాలు లేవని అందువలన సొసైటీలలో వస్త్ర నిల్వలు పేరుకుపోయి ఉన్నాయని ఆయన తెలిపారు. 2018 నుండి చేనేత వస్త్రాలపై 20 శాతం రాయితీ ఇవ్వలేదని తెలిపారు. అంతేకాకుండా యారం సబ్సిడీ, పావలా వడ్డీ పాత బకాయిలు, రిబేటు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. జాతీయ చేనేత దినోత్సవ సందర్భంగా ఈనెల7. వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చీరాలలో పర్యటిస్తున్న సందర్భంగా చేనేత పరిశ్రమ పై గాని, సొసైటీ ల కు రావలసిన బకాయిలు. పండుగ సమయాలలో వస్త్ర అమ్మకాలపై ఇచ్చే రిబేటు, తదితర విషయాలపై స్పష్టమైన హామీ చేనేత కార్మికులకు గాని, చేనేత పరిశ్రమ లకు గాని పూర్వ వైభవం తెచ్చే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటనలు, హామీలు ఇస్తారని ఆశాభావం చేనేత సహకార సంఘాల ప్రతినిధులు కార్మికులు ఎదురుచూస్తున్నారు.

అగ్ని బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

విశాలాంధ్ర - రేపల్లె : పట్టణంలోని 16 వార్డులో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన కట్టా సురేష్ కుటుంబానికి నిత్యవసర సరుకుల తోపాటు పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసినట్లు 16వార్డు మాజీ కౌన్సిలర్ కరేటి కోటేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు సంఘటన జరిగిన విషయాన్ని ఫోన్ ద్వారా తెలియజేయడంతో స్పందించిన మంత్రి వెంటనే మంత్రి బ్రో అనగాని శివప్రసాద్ కు విషయం తెలియజేయగా మంత్రి ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి నిత్యవసర సరుకులు పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నల్లూరి అజయ్ కుమార్, ధనుంజయ రావు, బెల్లంకొండ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రెవిన్యూ శాఖ తరపున బాధిత కుటుంబానికి నిత్యవసర సరుకులు, బియ్యం అందజేసినట్లు విఆర్వో తెలిపారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

విశాలాంధ్ర - యద్దనపూడి : తల్లిపాలు బిడ్డకు అమృతం కన్నా మిన్నా అని ఐసిడిఎస్ సూపర్వైజర్ సిహెచ్ సుజాత అన్నారు. మండలంలోని అనంతవరం గ్రామంలో తల్లి పాల వారోత్సవ కార్యక్రమంలో భాగంగా తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆమె బిడ్డకు తల్లిపాలను తప్పనిసరిగా పట్టాలని, తల్లిపాల వల్ల రోగ నిరోధక శక్తిని పెంపొందించవచ్చని, అన్నారు. తల్లుల ఆరోగ్యం పైనే బిడ్డల ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని, తల్లులు పౌష్టికాహారం తీసుకుంటే బిడ్డలు కూడా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ స్వాతి, అంగన్వాడి కార్యకర్తలు భూలక్ష్మి, తులసి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలు తొలగించాలని వినతి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్‌ను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహ ప్రిన్సిపల్ భవానీ దేవి కమిషనర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు 600 పైచిలుకు విద్యార్థినిలు ఉన్న తమ పాఠశాలలో వ్యర్థాలు,చెత్త, అధికంగా ఉంటుందని ప్రతిరోజు ఆ వ్యర్థాలు,చెత్త ను తొలగించే విధంగా శానిటేషన్ సిబ్బంది కి ఆదేశాలు ఇవ్వాలని కమీషనర్ ని కోరారు. దాతల సహాయముతో మూలన పడ్డ ఆర్వో ప్లాంట్ ని పునరుద్ధరించాలని, కెమిస్ట్రీ ల్యాబ్ లో ఫర్నిచర్ లేక విద్యార్థినిలు ఇబ్బంది పడుతున్నారని ఇంకా పలు సమస్యలు కమిషనర్ నిర్మల్ కుమార్ కి వివరించారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే దృష్టికి ప్రతి సమస్యను తీసుకువెళ్లి మంచి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రిన్సిపల్ తో పాటు జూనియర్ అసిస్టెంట్ జీవన శ్రీ కూడా పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం

విశాలాంధ్ర - నిజాంపట్నం : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమైనవని కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రణవీ అన్నారు.ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో తల్లిపాల విశిష్టతపై అవగాహన ర్యాలీ నిర్వహించి అంగన్వాడి సిబ్బంది, వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన తల్లిపాలే శిశువుకు ఎంతో ఆరోగ్యం, శ్రేయస్కరమని చెప్పారు.పుట్టిన బిడ్డకు ముర్రుపాలే మొదటి టీకాగా పనిచేస్తుందన్నారు.అంతేకాకుండా రోగనిరోధక శక్తి పెంచే గుణాలు అధికంగా ఉంటాయని, ఎటువంటి జబ్బులు కూడా చిన్నారులకు రానికుండా చేస్తుందన్నారు.తల్లిపాలలోనే విలువైన పోషక పదార్థాలు ఉంటాయని, ప్రతి తల్లి ఆరు మాసాల వరకు తమ శిశువు కు తల్లిపాలే అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మురళి, పిహెచ్ఎన్, అంగన్వాడి సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్ హెచ్పిఎస్, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్ నిరంకుశ విధానాలకు స్వస్తి పలకాలి

విశాలాంధ్ర - చీరాల : చీరాల ఆర్టీసీ డిపో మేనేజర్ సంవత్సరాల తరబడి అనధికారికంగా ఒక యూనియన్ వారికి ఓడిలు రాసుకుంటూ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యుల పట్ల పక్షపాత ధోరణి పాటిస్తున్నారని, సమస్యల పరిష్కారానికి చొరవ చూపకుండా దాటవేత ధోరణిలో ప్రవర్తిస్తున్నారని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు అన్నారు. మంగళవారం చీరాల ఆర్టీసీ బస్టాండ్‌లో సమస్యల పరిష్కారం చూపకుండా డిపో మేనేజర్ పాటిస్తున్న నిరంకుశ విధానాలను వ్యతిరేకిస్తూ ఎర్ర బ్యాడ్జీలు ధరించి ఆర్టీసీ ఉద్యోగులు విధులకు హాజరయ్యారు..ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యుల సమస్యలు పరిష్కరించకుండా డిపో మేనేజర్ పక్షపాత ధోరణితో వ్యవరిస్తున్నారని అన్నారు.ప్రజాస్వామ్య పద్దతిలో కనీసం సమస్యలు చెప్పుకునే అవకాశం కూడా ఇవ్వట్లేదని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ సభ్యుల సమస్యలు ఉన్నత స్థాయి అధికారులు కలుగజేసుకొని పరిష్కరించాలని అన్నారు.తమ సమస్యలు పరిష్కరించేంత వరకు ఎర్ర బ్యాడ్జీలతో నిరసన తెలుపుతామని అన్నారు.

చిన్న కంభం సచివాలయం పై దాడి

విశాలాంధ్ర-కంభం : చిన్న కంభం గ్రామ సచివాలయం పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే చిన్న కంభం గ్రామానికి చెందిన లద్దు ప్రసాదు, నక్క రంగయ్య, చరణ్, నక్క రంగయ్య అల్లుడు, ఇంకా కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు రంగస్వామి గుడి పెద్ద మనుషులమని తాగిన మైకంలో పంచాయతీ కార్యాలయంలో చొరబడి కార్యాలయం సంబంధించిన ముళ్ళకంచెను ఉపాధి హామీకి సంబంధించిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. ఇదేమిటని అడిగిన సచివాలయ సెక్రటరీ పై దాడికి పాల్పడ్డారు. జరిగిన సంఘటనపై పంచాయతీ సెక్రెటరీ చుంచు వెంకట సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనితో రంగంలోకి దిగిన పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

15న అన్నా క్యాంటీన్ ప్రారంభం

విశాలాంధ్ర - రేపల్లె : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఆగస్టు 15వ తేదీన ప్రారంభించనున్న అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనులను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు శివప్రసాద్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పట్టాభి రామారావు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పంతాన్ని మురళీధర్ రావు దేవగిరి రవిశంకర్ న్యాయవాది వై.ధర్మతేజ పరిశీలించారు. మునిసిపల్ కమిషనర్ బిఆర్ఎస్ శేషాద్రి, మున్సిపల్ డి ఈ శివరామకృష్ణ, మున్సిపల్ ఏఈ రోహిణి, ఇన్చార్జి మేనేజర్ రూపాంజలి, మున్సిపల్ ఆర్ఐ వై.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. అన్న క్యాంటీన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని ఈనెల 15వ తేదీన రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చేతుల మీదగా ప్రారంభ కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ శేషాద్రి, మున్సిపల్ డిఈ శివరామకృష్ణ తెలిపారు.

ఆశా కార్యకర్తల సమీక్ష సమావేశం

విశాలాంధ్ర -వేటపాలెం : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆషా డే ఆరోగ్య కేంద్రంలో మంగళ వారం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ స్వాతి కిరణ్, డాక్టర్ సాయి వైష్ణవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వాతి కిరణ్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని, తల్లి, బిడ్డలకు సకాలంలో వైద్య పరీక్షలు చేయించాలని, పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలని అన్నారు. డాక్టర్ సాయి వైష్ణవి మాట్లాడుతూ గర్భిణీలకు సలహాలు, వైద్య పరీక్షలు అందించాలని, వారికి ప్రతి నెల 9వ తారీఖున హాస్పిటల్ నందు గర్భిణి స్త్రీలకు వైద్య పరీక్షలు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సి. హెచ్. ఓ. గురవమ్మ, సబ్ యూనిట్ ఆఫీసర్ శేషు బాబు, సూపర్వైజర్ మార్తమ్మ, సుధాకర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ సి. హెచ్.ఓ .లు, ఏ. ఎన్. ఎం. లు ఆశాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన

విశాలాంధ్ర - బాపట్ల : స్థానిక బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పి.ఎస్. నారాయణ బట్టు ఆధ్వర్యంలో సి పి ఆర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్, పల్నాడు డిస్ట్రిక్ట్, నరసరావుపేటకు చెందిన పి వెంకటేశ్వరరావు కార్డియాకరెస్టు అయినప్పుడు సి పి ఆర్ ని ఎల్లా చేయాలో అధ్యాపకులకు విద్యార్థులకు వివరించారు. అనుకోకుండా ఎవరైనా కార్డియాక్ అరెస్ట్ కి గురైనప్పుడు ప్రథమ చికిత్సగా సిపిఆర్‌ను చేసి ప్రాణాలను కాపాడవచ్చని ఉదాహరణలతో కూలంకషంగా వివరించారు. ఈ కార్యక్రమం బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ వారి సహకారంతో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జి. శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ ఐ.హరిత , అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినిలు పాల్గొన్నారు. జాతీయ సేవా విభాగం అధికారులు కే కృష్ణకుమారి జి కళ్యాణి సమన్వయకర్తలుగా వ్యవహరించారు.